శుక్రవారం
03-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 132
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్ వినాశమే లక్ష్యం: హమాస్

జెరూసలేం: ఇజ్రాయిల్‌కు గుణపాఠం చెప్పేందుకు మళ్లీ మళ్లీ దాడులు చేస్తామని హమాస్ ప్రకటించింది. ఇటీవల లెబనాన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హమాస్ ప్రతినిధి ఘాజీ హమాద్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇవి తాజాగా బయటకు రావడంతో సంచలనంగా మారాయి. ఇజ్రాయిల్‌పై దాడిని సమర్థించుకున్నారు. మళ్లీ మళ్లీ దాడులు చేస్తామని, ఆ దేశాన్ని నాశనం చేసే వరకూ ఆగబోమని ఆయనన్నారు. స్వతంత్ర పలస్తీనా లక్ష్యంగా తమ పోరాటం సాగుతోందన్నారు. ఇజ్రాయిల్ అంతమే లక్ష్యమని అందుకోసం ఎంతటి మూల్యాన్ని చెల్లించేందుకైనా హమాస్ సిద్ధమని హమద్ స్పష్టం చేశారు. పౌరుల ప్రాణాలు తీయడం తమ ఉద్దేశం కాదని స్పష్టంచేశారు.

ఉపాధి హామీకి తూట్లు

- బడ్జెట్‌లో కోత దుర్మార్గం
- మోదీ సర్కారును గద్దె దించుదాం
- కాంగ్రెస్‌కు పట్టువిడుపులు అవసరం
- బీకేఎంయూ మహాసభలో డి.రాజా
- పేదలను మోసగిస్తున్న కేంద్రం: నితీశ్

పాట్నా: మోదీ సర్కారు పేదలు, వ్యవసాయ కూలీలు, రైతులను మోసం చేస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. మోదీ అధికారం చేపట్టి 9 ఏళ్లు గడిచినా పేదలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. వ్యవసాయ కూలీలకు పట్టెడన్నం పెట్టే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆగ్రహం వెలిబుచ్చారు. భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్(బీకేఎంయూ) జాతీయ 15వ మహాసభలు గురువారం పాట్నాలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభకు భారీగా వ్యవసాయ కూలీలు, పేదలు తరలివచ్చారు. అతిథులుగా నితీశ్‌కుమార్‌తో పాటు సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, బీకేయంయూ జాతీయ నాయకులు నాగేంద్రనాథ్ ఓఝా, బీకేయంయూ జాతీయ అధ్యక్షులు పెరియాస్వామి, ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, నిర్మల్, సీపీఐ బీహార్ రాష్ట్ర కార్యదర్శి రామ్‌నరేశ్ పాండే హాజరయ్యారు. రాజా మాట్లాడుతూ ఉపాధి హామీకి సంబంధించి బడ్జెట్‌లో నిధులపై పూర్తిగా కోత విధించారని మోదీపై నిప్పులు చెరిగారు. పేదల సమస్యలపై రాజీలేని పోరాటలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో మోదీ సర్కారును గద్దె దించడానికి వామపక్ష, లౌకిక, ప్రజాస్వామికశక్తులు ఏకం కావాలని విజ్ఞప్తి చేశారు. లౌకిక పార్టీ అయిన కాంగ్రెస్ పెద్దన్న పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని సూచించారు. విపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రయత్నించాలని, పట్టువిడుపులు ప్రదర్శించాలని హితవు పలికారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా బీజేపీని ఓడించడం కష్టమవుతుందన్న విషయాన్ని కాంగ్రెస్ గుర్తించాలన్నారు.

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పేదలను అడుగడుగునా మోసం చేస్తున్నదని, విభజించి-పాలించు నినాదంతో మోదీ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మోదీ సర్కారును గద్దె దించే లక్ష్యంతో విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయని, ఇండియా పేరుతో కూటమిగా ఏర్పడ్డాయని చెప్పారు. పేదలు, వ్యవసాయకూలీలు బీజేపీ హటావో దేశ్ బచావో అంటూ నినదిస్తున్నారని చెప్పారు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ వ్యవహార తీరుపై నీతీశ్ కుమార్ అసంతృప్తి వెలిబుచ్చారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపైనే కాంగ్రెస్ నిమగ్నమైందని, విపక్షాల కూటమి(ఇండియా)పై పెద్దగా దృష్టి పెట్టడం లేదని మర్శించారు. కాంగ్రెస్ వల్లే 'ఇండియా' కూటమి దూకుడు కొనసాగించలేక పోతోందని నితీశ్‌కుమార్ చెప్పారు. బీజేపీ, మోదీ సర్కారుపైనా నితీశ్‌కుమార్ విరుచుకుపడ్డారు. దేశ చరిత్రను మార్చేందుకు పాలకులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీలతో తనకు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మొదటిసారిగా తాను ఎన్నికల బరిలో దిగిన సమయంలో సీపీఐ, సీపీఎం తన విజయానికి కలిసి పని చేశాయన్నారు. బీహార్‌లో కమ్యూనిస్టుల ప్రగతిశీల దృక్పథాన్ని ఎంతో కీర్తించేవారమని, అప్పట్లో వారి ర్యాలీల్లో ఎంతోమంది మహిళలు పాల్గొనేవారని నితీశ్ కుమార్ గుర్తుచేశారు. గుల్జార్ సింగ్ గోరియా, నాగేంద్రనాథ్ ఓఝా తదితరులు మాట్లాడారు.

సాయంత్రం ప్రతినిధుల సభను డి.రాజా

- మిగతా 2 లో

కేసుల మీద కేసులు

- చంద్రబాబుపై ఇప్పటికే నాలుగు కేసులు
- తాజాగా ఇసుక తవ్వకాల్లో అక్రమాలంటూ మరో కేసు
- ఫైబర్‌గ్రిడ్ కేసులో ఏడు ఆస్తుల ఆటాచ్‌మెంట్‌కు నిర్ణయం
- సీఎం జగన్ మతిస్థిమితం కోల్పోయారని లోకేశ్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత, శాసనసభలో ప్రతిపక్షనేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం కేసుల మీద కేసులు పెడుతోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 52 రోజులపాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుకి హైకోర్టు ఆరోగ్య కారణాల రీత్యా నాలుగు వారాలపాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెల్సిందే. అయితే ఈ తీర్పు వచ్చే ముందు రోజే మద్యం అక్రమాల కేసు నమోదు చేసిన సీఐడీ... గురువారం ఇసుక అక్రమాలంటూ మరో కేసు నమోదు చేసింది. ఇందులో చంద్రబాబును ఏ2గా చేర్చింది. వీటికి ముందు ఫైబర్ గ్రిడ్, ఔటర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాలంటూ రెండు కేసులు నమోదు చేసింది. మరో 6 నెలల్లో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ వరుస కేసుల పరంపర ఏ ఉద్దేశంతో సాగుతోందన్న దానిపై ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతోంది. అలాగే కేసులన్నీ సీఐడీ నమోదు చేయడం, ఇవన్నీ దాదాపు ఒకేలా ఉండటం విశేషం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమాలు చోటు చేసుకున్నట్లు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఏపీఎండీసీ సీఐడీకి ఫిర్యాదు చేసింది. దీంతో సీఐడీ వెంటనే చంద్రబాబుతో పాటు ఆయన హయాంలో పనిచేసిన మంత్రులు, కొందరు టీడీపీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్ లో ఏ-1 గా పీతల సుజాత, ఏ-2గా చంద్రబాబు, ఏ-3గా చింతమనేని ప్రభాకర్, ఏ-4గా దేవినేని ఉమామహేశ్వరరావును నిందితులుగా పేర్కొన్నారు. వీరంతా తమ చర్యల ద్వారా ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం చేకూర్చారని మైన్స్ డైరెక్టర్ వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసింది. ఇప్పటికే చంద్రబాబు మధ్యంతర బెయిల్ సందర్భంగా ఆయనపై కోర్టు ఇచ్చిన గడువు వరకు ఎలాంటి చర్యలు తీసుకోబోమని సీఐడీ హైకోర్టుకు హామీ ఇచ్చిన క్రమంలో మద్యం, ఇసుక కేసుల్లో అరెస్టును అప్పటివరకు వాయిదా వేసుకోవాలని సీఐడీ నిర్ణయించింది.

ఫైబర్ గ్రిడ్ కేసులో సన్నిహితుల ఆస్తుల ఆటాచ్‌మెంట్‌కు పిటిషన్

ఫైబర్ గ్రిడ్ కేసులో సీఐడీ అధికారులు చంద్రబాబు సన్నిహితుల స్థిరాస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించారు. ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ అధికారుల ప్రతిపాదనకు హోంశాఖ ఆమోదం తెలిపింది. దీంతో ఏసీబీ కోర్టు అనుమతి కోసం గురువారం అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. టెరాసాఫ్ట్ కంపెనీతోపాటు చంద్రబాబు సన్నిహితులకు

- మిగతా 2 లో

ప్రతి నీటి చుక్కనూ ఒడిసి పట్టాలి

సుస్థిర వ్యవసాయానికి జల వనరులే ముఖ్యం
సమర్థ నిర్వహణే కొరతకు పరిష్కారం
ఐసీఐడీ సదస్సులో సీఎం జగన్

2లో

కరువు విలయతాండవం

- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- అన్నదాతపై సీఎం, మంత్రుల నిర్లక్ష్యం
- రామకృష్ణ విమర్శ
- పల్నాడు జిల్లాలో సీపీఐ, అఖిలపక్ష నేతల పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర-శావల్యాపురం/ఈపూరు: వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తోందని, పంటలు వేసి సాగునీరు అందక నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి కరువును పరిశీలిస్తున్నామని, అనంతరం ఓ సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని వెల్లడించారు. పల్నాడు జిల్లా శావల్యాపురం, ఈపూరు మండలాల్లో సీపీఐ, అఖిలపక్ష నాయకుల బృందం పర్యటించింది. నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న పంట పొలాలను పరిశీలించింది. శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద అద్దంకి బ్రాంచి కెనాల్‌ని నాయకులు పరిశీలించారు. కెనాల్‌లో నీటి చుక్కలేకపోవటంతో పాటు పక్కన ఉన్న పొట్లూరు గ్రామ పంట పొలాలు ఎండిపోయి ఉండటాన్ని నాయకులు గమనించారు. ఈపూరు మండలంలోని కొండ్రముట్లపాలెం, బోడెపూడివారిపాలెం, కొండ్రముట్ల గ్రామాలను సందర్శించారు. తర్వాత ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోనూ ఈ బృందం పర్యటించింది. పొలాల్లో పనులు చేసుకుంటున్న అన్నదాతలు, కూలీలతో ముచ్చటించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో దుర్భర పరిస్థితి దాపురించిందన్నారు. 18 జిల్లాల్లో కరువు పరిస్థితులున్నాయని, పల్నాడు జిల్లాలో 28 మండలాలు కరువుతో అల్లాడుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 24 లక్షల ఎకరాలు ఖరీఫ్ పంటకు దూరంగా ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ముగిసి... రబీ సీజన్‌కు వచ్చినా నీటి జాడ లేదని, వర్షాలు పడక అన్నదాత అయోమయానికి గురవుతున్నారన్నారు. వేల రూపాయల పెట్టుబడి పెట్టి మిర్చి, పొగాకు పంటలు వేయగా అవి కంటి ఎదుటే ఎండిపోతుంటే రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. అన్నదాత తీవ్ర ఇబ్బందులలో ఉంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గానీ, జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబుగానీ, ఎమ్మెల్యేలు, అధికారులు ఎక్కడా క్షేత్రస్థాయిలో

- మిగతా 2 లో

పాత పెన్షన్ కోసం నేడు 'చలో దిల్లీ'

ఏపీ నుంచి తరలివెళ్లిన ఉద్యోగులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పాత పెన్షన్ విధానం అమలు కోసం దేశ వ్యాప్త ఉద్యమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలనే డిమాండ్ తో ఉద్యమాలు ఊపందుకున్నాయి. రాష్ట్రం లోనూ కొనసాగుతున్నాయి. ఆ ఉద్యమాలను ఏకీకృతం చేసి సమైక్య పోరాటాలకు అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్ జీఎఫ్) శ్రీకారం చుట్టింది. దిల్లీలోని రామ్‌లీల మైదానంలో శుక్రవారం చలో దిల్లీకి తరలిరావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక వర్గాలకు సమాఖ్య పిలుపునిచ్చింది. అన్ని రాష్ట్రాల నుంచి లక్ష

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కరవుతో అల్లాడుతున్న నాయకులను ప్రకటించి ఆదుకోవచ్చు కదా!?

రెండు వారాల్లో డేటా

ఎన్నికల బాండ్లపై సుప్రీం ఆదేశాలు - తీర్పు రిజర్వు

న్యూదిల్లీ: దేశంలోని రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల రూపేణ సమకూరే విరాళాల తాజా డేటా ఇవ్వకపోవడంపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మీద సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. రెండు వారాల్లోగా సెప్టెంబరు 30వ తేదీ వరకు పూర్తి డేటా సమర్పించాలని ఆదేశాలిచ్చింది. మూడు రోజుల పాటు విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీర్పును రిజర్వులో పెట్టింది. రాజకీయ పార్టీలకు గుర్తుతెలియని నిధులను సమకూర్చే ఎన్నికల బాండ్ల పథకంపై అనుమానాలు వ్యక్తంచేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం మంగళవారం నుంచి గురువారం వరకు విచారించింది. సీల్డ్ కవర్‌లో

- మిగతా 2 లో

ఆగని మృత్యుహేల

- ఇజ్రాయిల్ భూతల, వైమానిక దాడులు తీవ్రతరం
- 9వేలు దాటిన మృతులు - వీరిలో 18ఏళ్లలోపు 3,760 మంది
- 195కి పెరిగిన 'జబాలియా' మృతులు

టెల్ అవీవ్/ జెరూసలేం: గాజా రక్తసిక్తమైంది. గాజా నగరంలో ఇజ్రాయిల్ భూతల దాడులు గురువారం భీకరంగా సాగాయి. ఈ మారణహోమాన్ని ఆపేందుకు అరబ్ దేశాలు దౌత్య మార్గాలను అనుసరిస్తున్నాయి. అమెరికా కూడా కసరత్తు పెంచింది. జబాలియా శిబిరంపై వరుస దాడులతో 195 మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని హమాస్ ప్రకటించింది. 27 రోజులుగా సాగుతున్న పోరులో పలస్తీనీయన్లు 9,061 మంది మృత్యువాత పడ్డారు. ఇందులో 3,760 మంది 18ఏళ్ల లోపు వారు ఉన్నారని గాజా ఆరోగ్య శాఖ ప్రతినిధి డాక్టర్ అష్రాఫ్ అల్ ఖిద్రా తెలిపారు. ఉత్తర గాజాలోని ముఖ్య ఆసుపత్రిలో ప్రధాన జనరేటర్ ఇంధనం లేక పనిచేయడం లేదని, దీంతో ఆరోగ్యపరంగా విపత్తుకర పరిస్థితులు నెలకొంటాయని హెచ్చరించారు. ఇతర ఆసుపత్రుల్లో ఇప్పటికే మందుల కొరత ఉందని, ఇంధనం లేక అత్యవసర సేవలు క్రమంగా నిలిచిపోతున్నాయని చెప్పారు. మరో పెద్ద ఆసుపత్రి 'షిఫా'లోని జనరేటర్ కూడా త్వరలోనే ఆగిపోనున్నట్లు వెల్లడించారు. గాజాలోకి అత్యవసర వైద్య సాయాన్ని అత్యవసరంగా పంపేందుకు సురక్షిత మార్గాన్ని ఏర్పాటు చేయాలని అన్ని వర్గాలను కోరుతున్నామన్నారు. మరోవైపు బుధవారంరం రాత్రి ఉత్తర గాజా స్ట్రిప్‌లో ఐడీఎఫ్ దళాలు విధ్వంసం సృష్టించాయి. హమాస్ సైన్యం తమపై ఎదురు దాడి చేసిందని ఇజ్రాయిల్

- మిగతా 2 లో

దౌత్యకార్యాలయాలు మూసివేస్తున్న ఉ.కొరియా

సియోల్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న దౌత్యకార్యలయాలను ఉత్తర కొరియా ఒకదాని తర్వాత ఒకటిగా మూసివేస్తోంది. దాదాపు 25శాతం మిషన్లను ప్యాంగ్యాంగ్ మూసివేసినట్లు తెలుస్తోంది. స్పెయిన్, హాంగ్‌కాంగ్ సహా ఆఫ్రికాలోని అనేక దేశాల్లోని దౌత్య కార్యాలయాలకు ఉత్తర కొరియా తాళాలు వేసినట్లు మీడియా నివేదికలు, విశ్లేషణలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఆంక్షలు ఉండటం వల్ల విదేశాల్లో సంపాదనకు అవకాశాలు లేకపోవడంతో దౌత్య కార్యాలయాలను ఉత్తర కొరియా మూసివేస్తున్నదని దక్షిణ కొరియా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గత వారం దేశ రాయబారులు అంగోలా, ఉగాండా నేతలకు వీడ్కోలు పలికినట్లు ఉత్తర కొరియా అధికారిక వార్తాసంస్థ కేసీఎన్ఏ తెలిపింది. తమ దేశాల్లోని ఉత్తర కొరియా దౌత్య కార్యాలయాలు మూతబడ్డాయని అంగోలా, ఉగాండా మీడియా పేర్కొన్నాయి. 1970 నుంచి ఈ దేశాలకు ఉత్తర కొరియాతో స్నేహ సంబంధాలు ఉన్నాయి. తాజా పరిణామాలు ఎన్నడూ లేని విధంగా విదేశీ విధానాన్ని కుదిపివేయనున్నట్లు అంచనాలు ఉన్నాయి. ఉత్తర కొరియాకు 159 దేశాలతో సంబంధాలు ఉన్నాగానీ విదేశాల్లో 53 దౌత్య కార్యాలయాలు మాత్రమే ఉన్నాయి. వీటిలో మూడు కాన్సులేట్లు, మూడు ప్రతినిధుల కార్యాలయాలు ఉన్నాయి. స్పెయిన్, ఇటలీ మిషన్లను కూడా ఉత్తర కొరియా మూసివేసింది. ఈ మేరకు అక్టోబరు 26వ తేదీతో ఉన్న లేఖను స్పానిష్ కమ్యూనిస్టు పార్టీ వెబ్‌సైట్‌లో ఉంచారు.

సెర్బియా పార్లమెంటు రద్దు: త్వరలో ఎన్నికలు

బెల్‌గ్రేడ్: సెర్బియా పార్లమెంటు రద్దు అయింది. దీంతో ముందస్తు ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. డిసెంబరు 17న స్థానిక ఎన్నికలతో పాటే పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహించాలని అధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్ పిలుపునిచ్చారు. యూరోపియన్ యూనియన్ నుంచి రాజకీయ ఒత్తిడి ఉండటంతో ఆయన పార్లమెంటును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సెర్బియన్ ప్రోగ్రెసివ్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి రెండేళ్లు కూడా పూర్తి కాకుండానే అధ్యక్షుడు బలవంతంగా పార్లమెంటును రద్దు చేయాల్సి వచ్చింది. శక్తిమంతమైన దేశాలతో కుదుకున్న రాజకీయ, ఆర్థిక కూటమిలో భాగస్వామ్యం కోసం యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో చేరేందుకు సెర్బియా ప్రయత్నిస్తోంది.

యూరోపియన్ యూనియన్‌లో చేరడమంటే ఈయూ మార్గదర్శకాలకు సెర్బియా కట్టుబడాలి. రష్యాపై ఆంక్షలు అమలు చేయాలి. సెర్బియాలోని ఈయూ అనుకూల పార్టీ స్పందిస్తూ 'సెర్బియా తీవ్రతమైన రాజకీయ, సామాజిక సంక్షోభంలో చిక్కుకొని ఉంది. నెలల తరబడి నిరసనకారులు చేస్తున్న డిమాండ్లను పట్టించుకోవడంలేదు. రాజకీయాల్లో బాధ్యతగల వారు అవసరం. సమస్యలు పరిష్కరించుకోవాలేగానీ విశ్మరించడం పరిష్కారం కాదు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహించుకోవడం అవసరం. పార్లమెంటు రద్దును అంగీకరిస్తున్నాం' అని పేర్కొంది.

ఫిబ్రవరి 11న పాక్ సార్వత్రిక ఎన్నికలు

ఇస్లామాబాద్: వచ్చే ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన పాకిస్తాన్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ (ఈసీపీ) గురువారం ప్రకటించింది. ఎన్నికల తేదీలను ప్రకటించాలన్న ఫిర్యాదుల క్రమంలో ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తామని సర్వోన్నత న్యాయస్థానానికి ఈసీపీ వెల్లడించింది. వచ్చే ఏడాది జనవరి 29కి నియోజకవర్గాల ఏర్పాటు కొలిక్కి వస్తుందని, అనంతరం ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమవుతుందని ఈసీపీ న్యాయవాది సజీల్ స్వాతి తెలిపారు. నేషనల్ అసెంబ్లీ, ప్రావిన్షియల్ లెజిస్లేచర్ రద్దు చేసిన 90 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో అనేక పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని సుప్రీంకోర్టు విచారిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ గురించి కోర్టు ఈసీపీ వివరించింది. నవంబర్ 30 నాటికి నియోజకవర్గాల పునర్విభజన పూర్తవుతందని త్రిసభ్య ధర్మాసనానికి వెల్లడించింది. 2022 ఏప్రిల్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వం రద్దయింది. అప్పటి నుంచి రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆగస్టు 9న పార్లమెంటు (నేషనల్ అసెంబ్లీ) రద్దు చేశారు. దీంతో సింధ్, బలూచిస్థాన్ అసెంబ్లీలు ముందస్తుగానే రద్దయ్యాయి. ఈ క్రమంలో ఎన్నికలు నిర్వహించి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది.

విశాలాంధ్ర ప్రపంచం

అధికార లాంఛనాలతో

లీ కియాంగ్ అంత్యక్రియలు

బీజింగ్: చైనా మాజీ ప్రధాని లీ కియాంగ్ అంత్యక్రియలు గురువారం అధికార లాంఛనాలతో ముగిశాయి. సంతాప సూచికంగా బీజింగ్ టియాన్మెన్ స్క్వేర్‌లో జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. ప్రముఖుల అంత్యక్రియలు జరిపించే బీజింగ్ స్మశానవాటికలో లీ కియాంగ్ అంతిమ సంస్కారాలు జరిగాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఆయన భార్య, ఆరుగురు కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్థాయి సంఘం సభ్యులు, ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్, పార్టీ ప్రముఖులు హాజరైన లీ కియాంగ్‌కు తుది వీడ్కోలు పలికారు. ఉదయం స్మశాన ఆడిటోరియంలో గంభీరమైన నిశబ్దం నెలకొంది. మెయిన్ హాల్‌లో 'కామ్రేడ్ లీ కియాంగ్ మరణం బాధాకరం' అన్న భారీ బ్యానర్ ఏర్పాటు చేశారు. దాని కింద లీ కియాంగ్ చిత్రపటాన్ని, భౌతికకాయాన్ని పచ్చిని మొక్కల మధ్యలో ఉంచారు. ఆయన భౌతికకాయంపై చైనా కమ్యూనిస్టు పార్టీ పతాకాన్ని కప్పారు. ఉదయం 9 గంటల సమయంలో జిన్‌పింగ్, ఆయన భార్య పెంగ్ లియాన్ చేరుకొని లీ కియాంగ్‌కు అంజలి ఘటించారు. తమ సంప్రదాయం ప్రకారం మూడుసార్లు వంగి నమస్కరించి నివాళులర్పించారు.

స్కిల్ కేసులో 12 మంది ఐఏఎస్‌లను విచారించండి

సీఐడీకి టీడీపీ న్యాయవాది ప్రసాద్ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్షపార్టీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేసులు బనాయిస్తుండడం, దానికి అధికారులు తందాన అంటూ సహకరిస్తున్న నేపథ్యంలో టీడీపీ అటువంటి అధికారులను కట్టడి చేసేందుకు సిద్ధమైంది. దీనిలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మొత్తం 12మంది ఐఏఎస్‌లను విచారించాలని సీఐడీకి తెలుగుదేశం పార్టీ ఫిర్యాదు చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో సీమెన్స్ ప్రాజెక్టు అమలు, పర్యవేక్షణ కమిటీల్లోని ఐఏఎస్ అధికారులను విచారణ పరిధిలోకి తీసుకురావాలని ఏపీ సీఐడీకి టీడీపీ తరపు న్యాయవాది ప్రసాద్ ఫిర్యాదు చేశారు. అజయ్ కల్లంరెడ్డి, అజయ్‌జైన్, రావత్, రవిచంద్ర, ఉదయలక్ష్మీ, ప్రేమ్ చంద్రారెడ్డి, సిసోడియా, కేవీ సత్యనారాయణ, శామ్యూల్ ఆనంద్ కుమార్, కృతిక శుక్లా, అర్జా శ్రీకాంత్, జి.జయలక్ష్మిలను విచారించాలని న్యాయవాది ప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుత స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, అప్పటి సీఎండీ బంగారు రాజులతో పాటు కార్పొరేషన్‌లోని సీఎఫ్ఓ, సీఈవో, ఈడీలను కూడా విచారించాలని కోరారు. కాంట్రాక్ట్, చెక్ పవర్‌తో సంబంధం ఉన్న వివిధ స్థాయిల్లోని అధికారులను విచారించాలని న్యాయవాది ప్రసాద్ కోరారు.

ప్రతి నీటి చుక్కనూ ఒడిసి పట్టాలి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సీజన్లో పడే ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసిపట్టి సద్వినియోగం చేసుకున్నప్పుడే కరువును ఎదుర్కోగలమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అధిక వర్షపాతమున్న ప్రాంతాల నుంచి కరువు కోరల్లో చిక్కిన భూములకు నీటిని మళ్లించే ప్రణాళిక అవసరమని చెప్పారు. విశాఖలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఏపీ జలవనరులశాఖ సంయుక్త అధ్వర్యంలో గురువారం ఇక్కడి రాడిసన్ బ్లూ హోటల్‌లో ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ)పై ఏర్పాటు చేసిన 25వ అంతర్జాతీయ సదస్సును కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో కలిసి ప్రారంభించారు. మూడు రోజులపాటు ఈ సదస్సు జరగనుంది. 90 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్నారు. సదస్సులో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ రాష్ట్రం జల వనరుల పరంగా మిగిలిన రాష్ట్రాల మాదిరిగానే సమస్యలు ఎదుర్కొంటోందన్నారు. వ్యవసాయానికి నీటికొరత ప్రధాన సమస్యగా ఉందని చెప్పారు. దీనికి మైక్రో ఇరిగేషన్ ఒక సమాధానంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. వర్షాలు కురిసే సమయం బాగా తగ్గిపోయిందని ప్రతి నీటి బొట్టునూ కాపాడుకోవాలన్నారు. సుస్థిర వ్యవసాయ నీటి నిర్వహణ అనే విస్తృత లక్ష్యానికి అనుగుణంగా ఐసీఐడీ స్థాపించడం జరిగిందని, ఈ ఫోరమ్ నీటిపారుదల, డ్రైనేజ్ వరద నిర్వహణ రంగాలలో అందిస్తున్న సహకారం ప్రశంసనీయమైనదన్నారు. ఆంధ్రప్రదేశ్ పెద్ద తీరప్రాంతాన్ని కలిగి ఉన్నప్పటికీ, రాయలసీమ, దక్షిణ కోస్తాలోని పశ్చిమ ప్రాంతాలు తక్కువ వర్షపాతం కారణంగా తరచుగా కరువు బారిన పడుతున్నాయని, ఇది ఆ ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులను దెబ్బతీస్తుందన్నారు. ఇంకా ఆంధ్రప్రదేశ్ అన్నింటికన్నా దిగువ నదీతీర రాష్ట్రంగా ఉన్నందున వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణ , పెన్నా వంటి ప్రధాన అంతర్రాష్ట్ర నదీ పరీవాహక ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైనప్పుడు నీటి కొరత సమస్యను ఎదుర్కొంటోందన్నారు. అధికవర్షాల కారణంగా వరదల వలన ఈ నదుల పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నామని, దీనిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సమర్థ నీటిపారుదల నిర్వహణ మాత్రమే మంచి పరిష్కారం చూపుతుందన్నారు. వ్యవసాయరంగంలో నీటి కొరతను అధిగమించడం ఎలా అన్న అంశంపైనే ఈ సదస్సు చర్చిస్తుందన్నారు. సాగునీటిరంగంలో నీటికొరత అంశం అనగానే ఎవరికైనా వెంటనే మైక్రో ఇరిగేషన్, స్ప్రింక్లర్లు గుర్తుకు వస్తాయని, నీటిని ఎలా వినియోగించుకోవాలనేదానికి ఈ తరహా ఆలోచనలు అవసరమేనన్నారు. వర్షాకాలంలో నీటి బదలాయింపు అంశంపై మరింత విస్తృతంగా చర్చ జరగాలన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో ఇలా ఒక బేసిన్ నుంచి మరొక బేసిన్‌కు నీటిని తరలించగలిగితే ఆయా రిజర్వాయర్లలో నీటి సామర్థ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించగలుగుతాం అన్నారు. కాలువల ద్వారా అత్యంత తక్కువ ఖర్చుతో ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీటిని తరలించగలుగుతాం. ఈ అంశంపై కౌన్సిల్ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, దీనిపై చర్చ జరగాలన్నారు. ఈ సదస్సు స్థిరమైన నీటి నిర్వహణకు సంబంధించిన అన్ని సమస్యలను సమగ్రంగా పరిష్కరిస్తుందని, సాంకేతికంగా సాధ్యమయ్యే, ఆర్థికంగా లాభదాయకమైన, సామాజికంగా ఆమోదయోగ్యమైన, పర్యావరణ అనుకూల పరిష్కారాలను రూపొందిస్తుందని తాను విశ్వసిస్తున్నానని అన్నారు.

ఉత్తమ వ్యవసాయ పద్ధతులు అలవర్చుకోవాలి: కేంద్ర మంత్రి షెకావత్

కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, జలవనరులను సమర్థంగా వినియోగించుకోవడం అవసరమన్నారు. భారత్‌లో ప్రస్తుతం 250 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉందని చెప్పారు. నీటి పునర్వినియోగానికి మంచి పరిష్కారాలను ఈ సదస్సు సూచించాలని కేంద్ర మంత్రి కోరారు. సమర్థ యాజమాన్య పద్ధతులు, వివిధ దేశాలలో అమలువుతున్న ఉత్తమ పద్ధతులు, భూగర్భ జలాల పెంపుదలకు అవసరమైన మార్గాలను సిఫార్సు చేయాలన్నారు. సంప్రదాయ జల వనరులని కాపాడుకుంటూ కొత్త యాజమాన్య పద్ధతులను సూచించాలని కోరారు. ప్రధాని చొరవతో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఎంవోయూ కుదుర్చుకున్నాయని, దీనివల్ల రెండు రాష్ట్రాలు తమ జల వనరులు పెంపుదలకు నదుల నీటి మార్పిడికి అవకాశం ఏర్పడిందన్నారు. డ్యాముల భద్రత, సమర్థ వినియోగంపై ప్రధాని ప్రత్యేక శ్రద్ధ పెట్టారని వివరించారు. ఈ సదస్సులో ఐసీఐడీ అధ్యక్షులు డా. రగాబ్ రగాబ్, ఐసీఐడీ ఉపాధ్యక్షుడు కుష్వేందర్ ఓహ్రా, జల వనరుల నిపుణుడు ఎన్‌డీ గులాటి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్నాథ్, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ హరి కిరణ్, ప్రిన్సిపల్ సెక్రటరీ ధనుంజయ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, శాసన మండలి సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస యాదవ్, వరుదు కల్యాణి, శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసు, వాసుపల్లి గణేశ్ కుమార్, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, నెడ్ క్యాప్ మాజీ చైర్మన్ కె.కె.రాజు, ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అంతర్జాతీయ, జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి తూట్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఉద్యమ నేపథ్యం తమిళనాడు వ్యవసాయ కార్మికసంఘం నుండి ప్రారంభమైందన్నారు. తమిళనాడు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశానని, గుజ్జుల యలమందరెడ్డి, పీకే కొడియన్, నాగేంద్రనాథ్ ఓఝా వంటి నాయకులతో తనకు అనుబంధం ఉందన్నారు. వ్యవసాయ కూలీలు ఆదివాసీలు, దళితులేనన్నారు. వారికి ఇళ్లు, సాగుభూములు ఉండవన్నారు. అలాంటి వర్గాల కోసం మనం పనిచేస్తున్నామని చెప్పారు. మోదీ ప్రభుత్వానికి రిమోట్ అంతా ఆర్‌యస్‌యస్ అని అన్నారు.పేద వర్గాల కోసం ఉద్యమాలు తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం, ఆర్థికంగా, రాజకీయంగా పేదలను చైతన్యవంతం చేయడానికి బీకేఎంయూ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, నాగేంద్రనాథ్ ఓఝా, ఏఐకేయస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, ఏఐవైయఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై తదితరులు పాల్గొన్నారు. అధ్యక్షవర్గం, స్టీరింగ్ కమిటీ, తీర్మానాలకమిటీ, మినిట్స్ కమిటీ, అర్హతలకమిటీని ఎన్నుకున్నారు. మినిట్స్ కమిటీ కన్వీనర్‌గా ఆంధ్రప్రదేశ్ నుండి ఆవుల శేఖర్‌ను ఎన్నుకున్నారు. మహాసభలకు ఆంధ్రప్రదేశ్ నుండి ఆవుల శేఖర్‌తోపాటు డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఆర్.వెంకట్రావు, బి.కేశవరెడ్డి చిలుకూరి వెంకటేశ్వరరావు, టి.కిష్టప్ప, ఆర్.విజయ, పండు గోలమని, పెద్దయ్య, శ్రీధర్, నాగుల్ మీరా, కృష్ణయ్య, ఎం.నబీ రసూల్, వసంతరావు, భూపేశ్, ఏసులు, రామారావు, తెలంగాణ నుండి ప్రధాన కార్యదర్శి యన్.బాలమల్లేశ్, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాల్లో డేటా

(మొదటిపేజీ తరువాయి)

బాండ్ల వివరాలు ఇవ్వాలని ఈసీఐకి తాజా ఆదేశాలిచ్చింది. రెండు పక్షాల వాదనలు విన్న తర్వాత తీర్పును రిజర్వు చేసింది. '2023, సెప్టెంబరు 30 వరకు డేటాను ఈసీఐ ఇవ్వాల్సి ఉంటుంది. వాదనలు విన్నాం. తీర్పును రిజర్వు చేశాం' అని పేర్కొంది. అదే సమయంలో 2019 ఏప్రిల్‌లో ఈసీఐకి తాత్కాలిక ఆదేశాలు జారీ చేయగా వాటి ప్రకారం సీల్డ్ కవర్‌లో పత్రాలు సమర్పించారు కానీ ఆ తేదీ వరకే కోర్టు ఉత్తర్వులను పరిమితం చేయలేం. వీటిపై మరింత స్పష్టమైన సమాచారం కావాలి' అని ధర్మాసనం పేర్కొంది. సెప్టెంబరు 30వ తేదీ వరకు డేటాను రెండు వారాల్లోగా కోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు సీల్డ్ ప్యాకెట్‌లో సమర్పించాలని ఈసీఐకి స్పష్టంచేసింది. ఎన్నికల బాండ్ల ద్వారా పార్టీలకు సమకూరిన మొత్తం గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించుకోవాలని, అడిగినప్పుడు ఇవ్వాలని సూచించింది. ఈసీఐ తీరుపై ధర్మాసనం ఒకింత అసంతృప్తి వ్యక్తంచేసింది. పార్టీలకు ఎన్నికల బాండ్ల రూపేణ లంచాలను చట్టబద్ధం చేశామా అని ఓ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. మూడు రోజులు సాగిన విచారణ క్రమంలో కేంద్రం తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. 'ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిన తరువాత ఏమైందన్నది ప్రశ్న. ఆ ధోరణలను బెంచ్ ముందు ఉంచాం' అని అన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది కనూ అగర్వాల్ కల్పించుకుని గతంలో రూ.20వేల కంటే తక్కువ నిధులు చెల్లించే వారి వివరాలు తెలిపే అవసరం ఉండేది కాదన్నారు. ఈ అంశాన్ని అవకాశంగా మార్చుకుని అధిక శాతం విరాళాలు ఈ మొత్తం కంటే తక్కువ ఉండేలా పార్టీలు జాగ్రత్త పడ్డాయని, పథకాన్ని దుర్వినియోగం చేశాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి మెహతా స్పందిస్తూ రూ.20 వేల కంటే తక్కువ విరాళాలు తగ్గాయని, ఎన్నికల బాండ్లు పెరిగాయని తెలిపారు. జస్టిస్ ఖన్నా జోక్యం చేసుకొని రూ.20వేల కంటే తక్కువ ఉన్న బాండ్లు ఏ మేరకు వచ్చాయో వివరాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల బాండ్లు పెరిగితే రూ.20వేల కంటే తక్కువ విరాళాలు తగ్గుతాయని సొలిసిటర్ జనరల్ చెప్పారు. బాండ్ల ద్వారా నిధులు సేకరించమన్న పార్టీ విషయంలో మాత్రమే రూ.20 వేల కంటే తక్కువ విరాళాలు తగ్గడం లేదని తెలిపారు. అందుకే ఆ పార్టీ పాత పద్ధతి కోసం డిమాండ్ చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల బాండ్లు వాస్తవంగా గోప్యంగా ఉన్నాయా లేక కొన్ని అంశాలను ఎంపిక చేసుకుని మరీ గోప్యంగా ఉంచుతున్నారా? అని న్యాయమూర్తులు ప్రశ్నించారు. తుషార్ మెహతా వాదిస్తూ ఎన్నికల బాండ్ల పథకాన్ని ఉద్దేశించి 'గోప్యత', 'పారదర్శకత లేమి' వంటి పదాల వాడకంపై న్యాయమూర్తులు నిగ్రహం పాటించాలని కోరారు. పథకం ఉద్దేశం వివరాలను గోప్యంగా ఉంచడం మాత్రమేనని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా పార్టీలకు విరాళిచ్చే వారు ప్రతిపక్ష పార్టీల చర్యలకు బాధితులుగా మారకుండా ఉండేందుకు, ప్రతీకార చర్యలకు పాల్పడకుండా నివారించేందుకు మాత్రమే ఈ గోప్యత నిబంధన అని స్పష్టం చేశారు. అక్రమ చెల్లింపులను చట్టబద్ధమైనవిగా మార్చేందుకు ఇది ఉపయోగపడటం లేదా అని సీజేఐ ప్రశ్నించడం గమనార్హం.

పాత పెన్షన్ కోసం నేడు 'చలో దిల్లీ'

(మొదటిపేజీ తరువాయి)

మందితో చలో దిల్లీ నిర్వహించనున్నారు. దీంతో దేశ వ్యాప్తంగా రాష్ట్రాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తరలి వెళ్లారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 3వేల మందికి పైగా భాగస్వాములు కానున్నారు. ఈ కార్యక్రమానికి ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులు బండి శ్రీనివాస్, ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి-అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు కేవీ శివారెడ్డి నాయకత్వం వహించారు. వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులున్నారు. విజయవాడ, గుంటూరు, ఏలూరు, వెస్ట్ కృష్ణా, కడప తదితర ప్రాంతాల నుంచి ఉద్యోగులు రైళ్ల ద్వారా, మరికొందరు విమానాల ద్వారా దిల్లీకి గురువారం సాయంత్రం బృందాల వారిగా బయల్దేరారు.

సమాఖ్య డిమాండ్లు ఇవే...

నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అందరికి అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, కార్మికులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్లతో 'చలో దిల్లీ' కార్యక్రమాన్ని అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య తలపెట్టింది. వాటితోపాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, రక్షణ, రైల్వే ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థలలో కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, కారుణ్య నియామకాలపై ఉన్న షరతులను తొలగించి... అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కరోనా సమయంలో ఆపివేసిన 18 నెలలు డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్మికుల ప్రజాస్వామిక హక్కులపై దాడి చేసే లేబర్ కోడ్లను రద్దు చేయడం తదితర డిమాండ్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా ఈ ఉద్యమానికి కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు శ్రీకారం చుట్టారు.

కరువు విలయతాండవం

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించిన దాఖలాలు కనిపించడంలేదని, రైతులను పట్టించుకోవటం లేదని రామకృష్ణ ధ్వజమెత్తారు. జగన్‌కి రైతు సమస్యల కంటే కేసులు, కక్షలు, కుట్ర రాజకీయాలే ముఖ్యమని మండిపడ్డారు. సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పొలాలు సందర్శించాలని డిమాండ్ చేశారు. పొరుగున గల కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను చూసి జగన్ సిగ్గుతెచ్చుకోవాలన్నారు. కేంద్ర బృందం తక్షణమే రాష్ట్రంలో పర్యటించాలని, కరువును అంచనా వేసి కరువు జిల్లాలను, కరువు మండలాలను ప్రకటించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంటలు ఎండుతున్నందున సాగర్ కుడికాలువకు తక్షణమే నీరు విడుదల చేసి రైతును ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణ సాయం ప్రకటించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పించాలని, సింగిల్ విండో పంట రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు రద్దు చేస్తామనడం సబబు కాదని, రైతులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ఇతర రాజకీయ పార్టీలను కలుపుకొని సీపీఐ పోరాటం చేస్తుందని రామకృష్ణ హెచ్చరించారు.

నీటి విడుదలలో ప్రభుత్వ వైఫల్యం: ముప్పాళ్ల

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీకి దత్తపుత్రుడిలా వ్యవహరిస్తున్న సీఎం జగన్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆల్మట్టి డ్యామ్ నుంచి నీటి విడుదలకు ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. వర్షపునీరు నిల్వ చేయటంపై రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ వహించలేదని ముప్పాళ్ల ధ్వజమెత్తారు. సాగునీరు విడుదల కాకపోవటంతో కరువు సంభవించి రైతులు వలస పోతున్నారని, పశుగ్రాసం దొరకని పరిస్థితి దాపురించిందన్నారు. రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని, ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రతినిధి బృందంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబూరావు, జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, వినుకొండ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు మోహన్ చంద్, తెలుగురైతు సంఘం నాయకుడు ముంద్రు హనుమంతరావు, రైతు నాయకులు అబ్బూరి అంజయ్య, సీపీఐ నాయకులు బూదాల సాగర్ బాబు, పూట్ల రామారావు, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, దారా రమేశ్, కొప్పెరపు మల్లికార్జున, ఆర్.వందనం, షేక్ మస్తాన్‌వలి, పొట్లూరి వెంకటేశ్వర్లు, నాదెండ్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కేసుల మీద కేసులు

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనకు రాష్ట్ర హోంశాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అటాచ్ అయిన ఆస్తుల్లో గుంటూరులో ఇంటి స్థలం, విశాఖపట్నంలో ఓ ఫ్లాట్, హైదరాబాద్‌లోని నాలుగు ఫ్లాట్లు, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి తదితర ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని కోరుతూ సీఐడీ అధికారులు విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ కేసులో నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో 797 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఇంటి స్థలం ఉంది.నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు డైరెక్టర్‌గా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెందిన విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్, టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ టి.గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్, శ్రీనగర్ కాలనీలో ఉన్న మరో ఫ్లాట్.. అలాగే ఈ కేసులో నిందితుడు తుమ్మల గోపీచంద్ పేరిట హైదరాబాద్ యూసఫ్‌గూడలో ఉన్న ఫ్లాట్, గోపీచంద్ భార్య పవనదేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో వ్యవసాయ భూమి ఉంది. ఈ స్థిరాస్తులను అటాచ్ చేయడానికి రాష్ట్ర హోంశాఖ అనుమతి ఇచ్చింది.

.సీఎం జగన్ మానసిక పరిస్థితి ఆందోళనకరం: లోకేశ్

సీఎం జగన్ మానసిక పరిస్థితి ఆందోళనకరస్థాయికి చేరిందని... గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకుని, కేంద్రానికి నివేదిక పంపాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడుపై రోజుకో తప్పుడు కేసు పెడుతున్న జగన్ కి పిచ్చి బాగా ముదిరిపోయిందని జనం చర్చించుకుంటున్నారని తెలిపారు. కక్షతో రగిలిపోతున్న జగన్ నైజం ఏంటో రాష్ట్ర ప్రజలకు పూర్తిగా అర్థం అయిందన్నారు. సీఎం స్థానంలో ఉండి ఉన్మాదిలా మారి, సీఐడీని వైసీపీ అనుబంధ విభాగంగా మార్చుకుని... ప్రతిపక్ష నేతమీద కేసుల మీద కేసుల పెట్టడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. సీఎం మానసిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, వెంటనే వైద్యపరీక్షలు జరపాలని కోరారు. ఈ విషయంలో గవర్నర్ గారు తక్షణమే జోక్యం చేసుకోకపోతే, ఈ పిచ్చి సీఎం తీసుకునే దారుణమైన నిర్ణయాలతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆగని మృత్యుహేల

(మొదటిపేజీ తరువాయి)

రక్షణ దళాల ప్రతినిధి వెల్లడించారు. అయితే తమ దాడుల్లో పదుల సంఖ్యలో హమాస్ వర్గీయులు మరణించినట్లు చెప్పారు. తాము ఇప్పటివరకు 332 సైనికులను కోల్పోయామని తెలిపారు.

ఫిరంగులతో దాడులు

ఇజ్రాయిలీ ట్యాంకులు, బుల్‌డోజర్లు ఉద్దేశపూర్వకంగా కట్టడాలను ధ్వంసం చేస్తున్నాయని, రోడ్లపై నుంచి వెళ్లకుండా దెబ్బతిన్న భవనాలను తొక్కుకుంటూ ముందుకెళుతున్నాయని స్థానికులు తెలిపారు. గాజా నగరం చుట్టూ ఫిరంగులతో దాడులు జరిగినట్లు వెల్లడించారు. దక్షిణ గాజాలోనూ భీకర దాడులు కొనసాగుతున్నాయని, ఖాన్ యూనియన్ పట్టణం వద్ద ముగ్గురు పలస్తీనియన్లు చనిపోగా వైమానిక దాడిలో ఐరాస స్కూలు వద్ద మరో ఐదుగురు మృత్యువాత పడ్డారని గాజా ఆరోగ్య అధికారులు తెలిపారు. బీచ్ శరణార్థి శిబిరం వద్ద దాడి జరిగిందన్నారు. పలస్తీనా సరిహద్దు అధికారి వయిల్ అబూ మెహసెన్ మాట్లాడుతూ గురువారం రఫా సరిహద్దు వెంబడి 400 మంది విదేశీయులు ప్రయాణించారని, బుధవారం 320 మంది వరకు వెళ్లారని చెప్పారు. తీవ్రంగా గాయపడిన 60 మంది పలస్తీనీయన్లనూ తరలించినట్లు మెహసెన్ వెల్లడించారు.

విరామం అవసరం: బైడెన్

గాజాపై ఇజ్రాయిల్ ముప్పేట దాడులు జరుపుతుండగా ప్రపంచ దేశాలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. పౌర హత్యలను ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. మానవతా విపత్తు నివారణకు తక్షణమే దాడులను ఆపివేయాలని పిలుపునిస్తున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందిస్తూ దాడులకు విరామం ఇవ్వాలని సూచించారు. బందీలను బయటకు తీసుకురావడానికి సమయం ఇవ్వాలన్నారు. మిన్నియాపొలిస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న బైడెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఎప్పటిలానే ఆయన నోట తప్పు దొర్లింది. బందీలను ఖైదీలుగా వ్యవహరించారు. దీనిపై శ్వేతసౌధం తర్వాత స్పష్టతిచ్చుకోవల్సి వచ్చింది. ఆయన మాట్లాడింది బందీల గురించే అని తెలిపింది. ఇదిలావుంటే హమాస్ నుంచి గాజాను స్వాధీనం చేసుకున్న తర్వాత ఏ విధంగా ముందుకెళ్లాలనే చర్చను అమెరికా ప్రారంభించింది. వివిధ రకాల సమీకరణాలను పరిశీలిస్తోంది. ఈమేరకు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సెనెట్ కేటాయింపుల కమిటీ విచారణలో తెలిపారు. 'గాజాలో హమాస్‌ను కొనసాగించడం సాధ్యం కాదు. గాజా పాలనపై ఇజ్రాయిల్‌కు ఆసక్తి లేదు. కాబట్టి మధ్యే మార్గం కోసం అన్వేషిస్తున్నాం' అని ఆయన కమిటీకి చెప్పారు. ఆ ప్రాంతంలోని దేశాలను పాలనలో భాగస్వాములు చేయాలా లేక భద్రత, పాలనలో సహకరించడానికి అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించాలా అనే దిశగా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. బ్లింకన్ వ్యాఖ్యలతో గాజాలో బహుళజాతి దళాలు నెలకొల్పవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జబాలియా దాడి యుద్ధ నేరమే : ఐరాస

జబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ వైమానిక దాడి యుద్ధ నేరమే అవుతుందని ఐరాస మానవ హక్కుల కార్యాలయం వెల్లడించింది. జబాలియా శిబిరంపై దాడిలో 195 మంది చనిపోగా 777 మంది గాయపడ్డారు. 100 మంది ఆచూకి లేరు. వీరు శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చన్న అంచనాలు ఉన్నాయి. తాజా పరిణామాలపై ఐరాస మానవహక్కుల హై కమిషనర్ కార్యాలయం ఎక్స్ మాధ్యమంగా స్పందించింది. 'ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరుపుతున్న విధ్వంసం, పెరుగుతున్న పౌరుల మరణాలన్నీ యుద్ధ నేరాలుగా పరిణమిస్తాయి' అని పేర్కొంది. జబాలియా శిబిరంపై దాడిని ఐక్యరాజ్య సమితి (ఐరాస) తీవ్రంగా ఖండించింది. గాజాలో హింస జరుగుతున్న స్థాయి తీవ్రస్థాయిలో కలచివేస్తోందని ఐరాస ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెర్రెస్ ఆందోళన వ్యక్తం చేసినట్లు ఆయనకు అధికార ప్రతినిధి స్టెఫనీ దుజార్రిక్ తెలిపారు. అమాయక మహిళలు, పిల్లలు సహా పలస్తీనా ప్రజలు భారీగా ప్రాణాలు కోల్పోతుండటం భయానకమన్నారు. అభంశుభం తెలియని పిల్లలను మృత్యుఒడికి చేరుస్తున్నారని యూనిసెఫ్ కూడా తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేసింది.

ఇది 'మద్యాం'ధ్రప్రదేశ్

- మద్యం నియంత్రణ హామీ అమలులో జగన్ విఫలం
- వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు మహిళలు సిద్ధం కావాలి
- ఏపీ మహిళా సమాఖ్య విశాఖ జిల్లా 11వ మహాసభలో దుర్గాభవాని

విశాలాంధ్ర-విశాఖ: అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రిస్తామని హామీనిచ్చి గద్దెనెక్కిన జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని విమర్శించారు. మహిళా సమాఖ్య విశాఖ జిల్లా 11వ మహాసభ గురువారం స్థానిక మురళీనగర్ వాకర్స్ హాల్‌లో ఎంఏ బేగం అధ్యక్షతన జరిగింది. దుర్గాభవాని మాట్లాడుతూ రాష్ట్రంలో వాడువాడలా మద్యం ఏరులై పారుతున్నా ముఖ్యమంత్రికి పట్టడంలేదని విమర్శించారు. మద్య నియంత్రణ వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. మడమ తిప్పను, మాట తప్పను అంటే ఇదేనా? అని నిలదీశారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని చూపించి వేల కోట్ల రూపాయలు అప్పులు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని దుయ్యబట్టారు. ధరల నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయమని, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలపై దాడులు అధికమయ్యాయని అన్నారు. గ్యాస్, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఇలాంటి ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ఇంటికి పంపేందుకు మహిళలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా సమాఖ్య నిర్వహించిన పోరాటాల తీరును దుర్గాభవాని వివరించారు. తొలుత స్థానిక బిర్లా జంక్షన్ నుంచి మురళీనగర్ వాకర్స్ పార్క్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహిళా సమాఖ్య జెండాలు చేబూని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రదర్శనను సాగించారు. మహిళలకు రక్షణ కల్పించాలని నినదించారు. మహిళా సమాఖ్య జెండాను సీనియర్ నాయకులు వెంకటరమణమ్మ ఆవిష్కరించారు. అనంతరం కార్యదర్శి నివేదికను మహాసభలో జిల్లా కార్యదర్శి ఎ.విమల ప్రవేశపెట్టారు. భవిష్యత్ కార్యాచరణ, నూతన నాయకత్వానికి తగు సూచనలు చేశారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు వక్తల్లో ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నూతన నాయకత్వం ఎన్నికైంది. అధ్యక్షులుగా కె.వనజాక్షి, ఉపాధ్యక్షులుగా ఎస్ అరుణ, ఎ దేవుడమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేగం, సహాయ కార్యదర్శులుగా ఎ.అన్నపూర్ణ, శ్రీగాయత్రీ, కోశాధికారిగా జి.జయలత ఎన్నికయ్యారు. మొత్తం 21 మందితో నూతన కమిటీ ఎన్నికైంది.

కరువు మండలాలను పునఃసమీక్షించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-త్రిపురాంతకం: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అత్యల్ప వర్షపాతం నమోదైందని, కరువు తీవ్రమవుతోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. కరువు మండలాల ప్రకటనపై పునఃసమీక్షించాలని, కొత్త ప్రకటన వెలువరించాలని, అన్ని మండలాల్లో కరువు నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన గురువారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా, త్రిపురాంతకం మండలంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్, రబీలో పంట వేయలేక పోయిన రైతులను ఆదుకోవాలని, పంట వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆహార పంటలకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. వందలాది గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉందని, గ్రామీణ రైతులు వలసబాట పడుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో సమీక్ష చేయించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్న విజ్ఞత రాష్ట్ర ప్రభుత్వానికి కొరవడిందని విమర్శించారు. రాజకీయ పార్టీలు, రైతు సంఘాలతో సమావేశం నిర్వహించి ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పంటల బీమా, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసి వలసలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఖరీఫ్‌లో రైతులు, కౌలు రైతులు తీసుకున్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని, రబీ కాలానికి తిరిగి వడ్డీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రబీలో పంటలు వేసే రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలని, పశుగ్రాసం, దానా ఉచితంగా ఇవ్వాలని, కరువు పింఛన్లు అందజేయాలని కూడా కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు సాంబశివ రావు, మండల కార్యదర్శి బాణాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ విశాఖ వస్తే...

ఉద్యోగాలు చేయొద్దా?

రిషికొండ రాడిసన్ బ్లూ రహదారి మూసివేతపై ఐటీ ఉద్యోగులు, వాహనదారుల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడో నెలకోసారి విశాఖకు వస్తేనే రోడ్లపై రాకపోకలను నిలిపివేస్తున్నారు... ఇక ఆయన విశాఖలోనే నివాసం ఉంటే రహదారులన్నీ మూసేస్తారేమోనని విశాఖనగర వాసులు బెంబేలెత్తుతున్నారు. ఇక తాము ఐటీ ఉద్యోగాలు చేసుకోలేమని... భీమిలి వెళ్లే బీచ్ రహదారిని మొత్తం మూసేస్తారేమో అని అటువైపు ప్రయాణించే ఐటీ ఉద్యోగులు, వాహనదారులు గురువారం తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. సీఎం జగన్ హెలికాప్టర్‌లో తిరిగితే రోడ్లపై ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందని అనేకమంది ఆగ్రహం వ్యక్తం చేశారు. రుషికొండ దగ్గర రాడిసన్ బ్లూ హోటల్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ కాంగ్రెస్ ప్లీనరీకి ముఖ్యమంత్రి జగన్ హాజరయ్యారు. గురువారం ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి సీఎం చేరుకున్నారు. విమానాశ్రయంలో సీఎంకు అనేకమంది మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, వైసీపీ శ్రేణులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రుషికొండ హిల్-3కి హెలికాప్టర్‌లో జగన్ వెళ్లారు. ఈ సందర్భంగా హెలికాప్టర్‌లో సీఎం జగన్ ప్రయాణించినప్పటికీ రోడ్డు మార్గంలో ఆంక్షలు విధించడంపై అనేకమంది ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం పర్యటన సందర్భంగా మధురవాడ ఐటీసీ వద్ద ఐటీ ఉద్యోగులు, స్థానికుల రాకపోకలపై పోలీసులు ఆంక్షలు విధించారు. రాడిసన్ బ్లూ హోటల్ వైపు వెళ్లకుండా ప్రత్యేక ఆంక్షలు విధిస్తూ అక్కడకు వస్తున్న వాహనాలను పోలీసులు తిరిగి వెనక్కి పంపేయడంపై అనేకమంది పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఎం జగన్ విశాఖకు ఎప్పుడు వచ్చినా తమనెందుకు ఇబ్బందులు పెడుతున్నారని సామాన్య ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల ఆంక్షలతో నిర్ణీత సమయంలో ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. ఇప్పుడే ఇలా ఉంటే త్వరలో రుషికొండలో సీఎం జగన్ నివాసం ఉంటే ఇక భీమిలి బీచ్ రోడ్ రహదారిని పూర్తిగా మూసేస్తారని వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ హిల్స్‌లో ఉద్యోగులను జగన్ వచ్చే ప్రతిసారి పోలీసులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల మహాధర్నా జయప్రదం చేయండి

దేగా ప్రభాకర్ పిలుపు

విశాలాంధ్ర-భీమవరం: రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ఇచ్చిన హామీల అమలునకు డిమాండ్ చేస్తూ ఈనెల 27,28 తేదీల్లో విజయవాడలతో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చాయి. వీటి అధ్వర్యంలో గురువారం భీమవరంలోని ఆనంద పంక్షన్ హాల్‌లో ఆకుల హరేరామ్ అధ్యక్షతన మహా ధర్నా సన్నాహక జిల్లా సదస్సు జరిగింది. ఏపీ రైతు సంఘం నాయకుడు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ పోలవరం రైతులు, నిర్వాసితుల కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఉద్ఘాటించారు. సమస్యల పరిష్కారం, హామీల అమలు కోసం ఉద్యమాలు తప్పబోవన్నారు. ఇదే క్రమంలో విజయవాడ మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ రైతులకు మొండి చేయి చూపే ప్రధాని మోదీని ఇంటికి సాగనంపక తప్పదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వడంలో పాలకులు విఫలమయ్యారని దుయ్యబట్టారు. నల్ల సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఉవ్వెత్తున సాగిన రైతాంగ ఉద్యమంలో 750 మంది రైతులు చనిపోతే కనీసం పరిహారం ఇవ్వలేదని దేగా ప్రభాకర్ గుర్తుచేశారు. ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ గ్రామాలకు వెళ్లి ఉద్యమాలు నిర్మించాలన్నారు. చారిత్రక కిసాన్ పోరాటంలో అమరులైన రైతుల కుటుంబాలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాతో పాటు ఆయన కుమారుడిని విచారించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లును, కార్పొరేట్ అనుకూల పీఎం ఫసల్ బీమా పథకాన్ని ఉపసంహరించాలని, ప్రీ పేయిడ్ మీటర్లు తొలగించాలని జమలయ్య డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బి.బలరామ్, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక కృష్ణమూర్తి, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఝాన్సీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.రాజారామమోహన్ రాయ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెంటే పార్థసారధి తదితరులు కీలకోపన్యాసాలు చేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి నాయకుడు తమ్మినీడి నాగేశ్వరరావు, ఏఐకేఎస్ నేత దండు శ్రీనివాసరాజు, సీపీఎం నాయకులు జేఎన్‌వీ గోపాలన్, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం

8న విద్యాసంస్థల బంద్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖ ఉక్కు పరిరక్షణ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న విద్యార్థి, యువజన సంఘాలు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా కేజీ టు పీజీ విద్యాసంస్థల మూసివేతకు నిర్ణయించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఏ, ఏఐడీఎస్ఓ, పీఓఎస్ఓ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ తదితర విద్యార్థి, యువజన సంఘాలు ఈ మేరకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించాయి. విద్యాసంస్థల బంద్ విజయవంతంలో భాగంగా అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడం, కరపత్రాల పంపిణీ ద్వారా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఆవిర్భవించిందని, మోదీ ప్రభుత్వం దీనిని ప్రైవేటీకరించడాన్ని సహించేది లేదని విద్యార్థి, యువజన సంఘాలు హెచ్చరించాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కొనసాగుతున్న ఉద్యమం ఈనెల 8వ తేదీ నాటికి వెయ్యి రోజులకు చేరుకుంటుంది. దీంతో విద్యార్థి సంఘాలు బంద్ చేయాలని నిర్ణయించాయి. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్రం వెంటనే విరమించాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశాలపై మోదీ ప్రభుత్వాన్ని నిలదీయడంలో సీఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారని విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. సీఎం జగన్ కేసులకు భయపడే కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదని విమర్శిస్తున్నారు. బంద్‌కు వివిధ ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాయి.

గ్రూప్-1,2 పోస్టులు పెంచాలి

అభ్యర్థుల వయో పరిమితి 44 ఏళ్లు చేయాలి: ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వం గ్రూప్ 1,2 ఉద్యోగాల సంఖ్యను పెంచి నియామక నోటిఫికేషన్ ఇవ్వాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. స్థానిక దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్ బాబు మాట్లాడుతూ... అనేక ఏళ్లనుంచి ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. అయితే అభ్యర్థుల వయోపరిమితి మించిపోతున్నందున ఏపీపీఎస్సీ నోటిఫికేషన్‌లో వయోపరిమితిని 42 నుండి 44 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కళాశాల లెక్చరర్ పోస్టులకు ఏపీ సెట్ పరీక్షను వెంటనే నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ కోసం లోపాలు లేకుండా నోటిఫికేషన్లు ఇవ్వాలని, కేవలం ఎన్నికల కోసం కాకుండా నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరు సంవత్సరాల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ రాలేదని... ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో భర్తీ చేస్తున్న అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాలలో అవినీతి అక్రమాలకు తావు లేకుండా రోస్టర్ పద్ధతి ప్రకారం భర్తీ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, విజయవాడ నగర కార్యదర్శి లంక గోవిందరాజులు, ఉపాధ్యక్షులు గుంజ క్రాంతి కుమార్, సహాయ కార్యదర్శి సింగంశెట్టి మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలస విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లు

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా కూలి పనులు లేక వలస వెళ్తున్న నిరుపేద విద్యార్థులకు తక్షణమే సీజనల్ హాస్టళ్లు ప్రారంభించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు అమరావతిలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ మువ్వ రామలింగంను ఎస్టీయూ నేత తిమ్మన్న గురువారం కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తిమ్మన్న మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, తీవ్రమైన కరువు పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని, ప్రత్యేకించి రాయలసీమ జిల్లాలలో అధికంగా ఉన్నాయని వివరించారు. పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు రోజువారీ వ్యవసాయ కూలి పనులు లేక... కడుపు చేత పట్టుకుని బతుకుతెరువు కోసం గుంటూరు జిల్లా, కృష్ణాజిల్లా, హైదరాబాదు, బెంగళూరు, ముంబై వంటి ప్రాంతాలకు వెళుతున్నారని, పిల్లలను పాఠశాలలకు వెళ్లకుండా వెంట తీసుకెళుతున్నారని వివరించారు. దీనివల్ల పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు పాఠశాల విద్యకు దూరమై, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లు పెరుగుతున్నాయని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి కర్నూలు, అనంతపురం జిల్లాలలో తల్లిదండ్రులు వలస వెళ్లిన చోట విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేలా సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ రాయలసీమ కర్నూలు జిల్లాలోని ఆదోని, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులు కూలి పనుల కోసం వలస పోతున్నారని తెలిపారు.

'సరిలేరు నీకెవ్వరు' మల్లిపురం జగదీశ్

గిరిజన రచయితకు ప్రతిష్టాత్మక పురస్కారం



విశాలాంధ్ర-పార్వతీపురం: గిరిజన రచయిత మల్లిపురం జగదీశ్‌ను ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. 'సరిలేరు నీకెవ్వరు' అవార్డుతో ఆయను సన్మానించనున్నారు. తెలంగాణ సాహితీ సంస్థ అజోవిబో-కందాళం ఫౌండేషన్ ఈ పురస్కారాలను వివిధ రంగాలలో యుద్ధ ప్రతిష్టులైన వారికిచ్చే 'సరిలేరు నీకెవ్వరు' పురస్కారానికి పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన మల్లిపురం జగదీశ్ ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ గురువారం ప్రకటించింది. అజోవిబో-కందాళం ఫౌండేషన్ రైటర్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా 2024, జనవరి 5న విశాఖపట్టణం కళాభారతిలో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. అవార్డు రూపేణ రూ.25వేల నగదు అందజేస్తారు. మల్లిపురం జగదీశ్‌ను ప్రతిష్టాత్మక పురస్కారం వరించడంపై పార్వతీపురానికి చెందిన ప్రముఖ రచయితలు గంటేడ గౌరునాయుడు, స్నేహ కళాసాహితీ అధ్యక్షులు జి.రామకృష్ణ, చింతా అప్పలనాయుడు, సిరికిస్వామి నాయుడు, పక్కి రవీంద్రనాథ్, పాలకొల్లు రామలింగస్వామి, నారం శెట్టి ఉమామహేశ్వరరావు, బెలగాం భీమేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. జగదీశ్‌కు సాహిత్య అభిమానులు అభినందనలు తెలిపారు. అజోవిబో-కందాళం సంస్థ 1994లో ఏర్పడింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సాహిత్య- సాంస్కృతిక కళా రంగాలలో గణనీయ సేవలు అందించిన వారికి ప్రతిభామూర్తి, విశిష్ట సాహితీమూర్తి పురస్కారాలను అందజేస్తున్నది. 2014 నుంచి తెలుగు వారికి 'సరిలేరు నీకెవ్వరు' విశిష్ట పురస్కారాన్ని అందిస్తోంది. ఈ పురస్కార గ్రహీతల్లో సర్వశ్రీ కందిమళ్ల సాంబశివరావు, స.వెం.రమేశ్ (పొన్నూరు), అట్టాడ అప్పల్నాయుడు, పెద్దింటి అశోక్ కుమార్ (అనకాపల్లి), మహమ్మద్ ఖదీర్ బాబు, కె.విజయలక్ష్మి (చిలకలూరుపేట), సత్యానంద్, జగద్ధాత్రి (పాయకరావుపేట), పాటిబండ్ల ఆనందరావు (గుంటూరు), రాయన గిరిధర్‌గౌడ్ (తెనాలి), వల్లూరి శివప్రసాద్ (బాపట్ల), వీవీ రామారావు (హైదరాబాద్), మాకినీడి సూర్య భాస్కర్ (కాకినాడ), మానుల్దార్ హరికిషన్ (నంద్యాల) ఉన్నారు.

వైసీపీ పాలనలో అప్పుల ఊబిలోకి రాష్ట్రం

పురందేశ్వరి

విశాలాంధ్ర-రాజంపేట: వైసీపీ పాలనలో రాష్ట్రం రూ.11 లక్షల కోట్ల రుణభారంలో ఉందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విరుచుకు పడ్డారు. గురువారం ఆమె అన్నమయ్యజిల్లా రాజంపేటలో పర్యటించారు. బోయినపల్లిలోని చేనేత కార్మికులను పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలతో బతుకు కష్టమైందని చేనేత కార్మికులు ఆమెకు మొరపెట్టుకున్నారు. వైఎస్ జగన్ చేనేతలకు నేతన్న నేస్తం అనే పథకాన్ని ప్రవేశపెట్టి అనేక నిబంధనలు విధించి, చేనేతల పొట్ట కొడుతున్నారని పురందేశ్వరి విమర్శించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ అధ్వర్యంలో రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం వద్దకు చేరుకొని అక్కడ అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తోట కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాజంపేటకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నందలూరు ప్రజలకు తాగునీటి కొరత తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి బాబాయ్ మేడా భాస్కర్ రెడ్డి స్వాహా చేశారని ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి కేంద్రీయ విద్యాలయం తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని, సాయి లోకేష్ పోరాటాల ఫలితంగా పోలి గ్రామంలో ఏడున్నర ఎకరాల స్థలాన్ని కేంద్రీయ విద్యాలయం కోసం సాధించడం జరిగిందని వివరించారు. రాయలసీమలో కరువు విలయతాండవం చేస్తుంటే వైసీపీ కి అనుకూలంగా ఉన్న కేవలం 120 మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించడం అన్యాయమని వివరించారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి మూడు సంవత్సరాలు కావస్తున్నా వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నేటికీ ఆ ప్రాంత ప్రజలు గుడారాలలోనే నివసిస్తున్నట్లు తమ దృష్టికి తీసుకువచ్చారని, వారి ఆవేదన చూసి బాధేసిందన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఉన్న పరిశ్రమలు కూడా పక్క రాష్ట్రాలకు తరలివెళుతున్నాయని అన్నారు. అన్ని వర్గాలను హింసిస్తూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి లాగిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మరలా అధికారం ఇవ్వాలని ప్రజలు కోరుకోవడం లేదని తెలిపారు. అనంతరం బీజేపీ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం సభ్యులతో పార్లమెంట్ స్థాయి సమావేశాన్ని నిర్వహించి పార్టీ బలోపేతానికి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట శివ నారాయణ, జిల్లా ఇన్చార్జి చంద్రమౌళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 రోజుల్లో 50 పైసల అవినీతినైనా నిరూపించారా?: పయ్యావుల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబును స్కిల్ కేసులో అక్రమంగా అరెస్ట్ చేసి 52 రోజులు జైల్లో ఉంచారు కానీ 50పైసలైనా డబ్బు బదిలీ అయినట్లు నిరూపించగలిగారా? అని ఆ పార్టీ సీనియర్ నేత పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు రావడానికి 14 గంటలు ఎందుకు పట్టింది? ఎందుకంత జనసునామీ పోటెత్తింది? ప్రజాదరణతో చంద్రబాబు వాహనశ్రేణి కదలలేని పరిస్థితి ఎందుకు వచ్చింది? అన్న ప్రశ్నలకు సమాధానాలు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ప్రభుత్వ ఇంటిలిజెన్స్ వర్గాలు చెప్పలేదా అని ఎద్దేవా చేశారు. కేశవ్ గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు తప్పు చేయలేదని అన్నారు. ఆయనపై ప్రజల అపార నమ్మకానికి అర్ధరాత్రి రోడ్లపై ఉప్పొంగిన ప్రజాభిమానమే నిదర్శనమన్నారు. సీఐడీ చీఫ్, అడిషనల్ ఏజీ, ప్రభుత్వ సలహాదారు సజ్జల, మంత్రులు నోటికి వచ్చిన అబద్ధాలతో దుష్ప్రచారం చేస్తున్నారు తప్ప ఒక్క రూపాయి అవినీతి జరిగినట్లు నిరూపించారా? అని ప్రశ్నించారు. పార్టీ సభ్యత్వం పొందడానికి కార్యకర్తలు చెల్లించిన దాన్ని అవినీతి సొమ్ము అనడాన్నిబట్టి ఎంతగా బరితెగించారో అర్థమవుతుందని విమర్శించారు. అక్రమ కేసుతో జైలులో పెట్టారే తప్ప స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతి జరిగినట్లు నిరూపించడం తలకిందులు తపస్సు చేసినా మీకు సాధ్యం కాదన్నారు. రాజకీయ కుట్రలకు చంద్రబాబుని బలి చేయడానికి సృష్టించిన ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లను న్యాయస్థానాలు మీ ముఖంపైనే విసిరేసి చీవాట్లు పెట్టే రోజు దగ్గరలోనే ఉందని కేశవ్ హెచ్చరించారు.

సంపాదకీయం

ప్రతిపక్ష నేతలపై కొనసాగుతున్న వేట

ఎన్నికల గోదాలోనే కాకుండా ఇతర అధికార వ్యవస్థలు, పార్లమెంటరీ కమిటీలు, కేంద్ర ప్రభుత్వ అధీనంలోని దర్యాప్తు సంస్థలలో కూడా ప్రతిపక్షాలు మోదీ ప్రభుత్వంతో అటో ఇటో తేల్చుకోవాలనే సంకల్పించినట్టు కనిపిస్తోంది. ప్రతిపక్షాలు ఇలాంటి ధోరణి అనుసరించాలని ప్రతిపక్షాలు సంకల్పించినట్టు గురువారం రెండు సంఘటనలు జరిగాయి. దిల్లీ సారా కుభ కోణంలో విచారణకు హాజరు కావాలని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ (ఇ.డి.) పంపిన సమన్లను దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఖాతరు చేయలేదు. మరోవేపు డబ్బు తీసుకుని పార్లమెంటులో ప్రశ్నలు అడుగుతున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మహువా మొయిత్రా పార్లమెంటు నైతిక ప్రమాణాల కమిటీ విచారణకు హాజరైనా మధ్యలోనే ఆ విచారణను బహిష్కరించారు. కొన్ని ప్రతిపక్షాలు కూడా ఆమెకు మద్దతుగా విచారణను బహిష్కరించాయి. ఇలా బహిష్కరించిన వారిలో నైతిక ప్రమాణాల కమిటీ సభ్యులుగా ఉన్న ప్రతిపక్ష సభ్యులు ఉన్నారు. మద్యం కుంభకోణం వ్యవహారాన్ని ఆసరాగా చేసుకుని దిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీని ఛిన్నాభిన్నం చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఈ కుట్రకు అనుగుణంగానే మద్యం కుంభకోణం కేసులో 2022 మేలో ద్రవ్య అక్రమ చెలామణి చట్టాన్ని ఉల్లంఘించారన్న నెపంతో అప్పుడు దిల్లీలో మంత్రిగా ఉన్న సత్యేంద్ర జైన్‌ను అరెస్టు చేశారు. ఆ తరవాత దిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను కూడా మద్యం కుంభకోణంలో గత ఫిబ్రవరిలో సీబీఐ అరెస్టు చేసింది. ఆమ్‌ఆద్మీ పార్టీ మరో మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ మీద మోదీ చేతిలోని దర్యాప్తు సంస్థలు దాడులు చేశాయి. చట్టసభలో ప్రశ్నలు అడగడానికి చట్టసభల సభ్యులు డబ్బులు తీసుకుంటారన్న ఆరోపణలు కొత్త కావు. మద్యం కుంభకోణాల గురించీ దీర్ఘకాలంగా వింటూనే ఉన్నాం. ఈ వ్యవహారాల్లో ఆరోపణలు, దర్యాప్తులు జరుగుతూనే ఉంటాయి. ఆరోపణలకు గురైన వారందరూ దోషులుగా తేలిన సందర్భాలైతే లేవు. మోదీ హయాంలో కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, ద్రవ్య అక్రమ చెలామణి చట్టాన్ని ఉల్లంఘించడానికి సంబంధించిన కేసులు నిత్యం వార్తలకు ఎక్కుతూనే ఉన్నాయి. మోదీ ప్రభుత్వం ఈ చట్టాలను ప్రతిపక్షాలను చావుదెబ్బ తీయడానికి అనువైన ఆయుధాలుగా మార్చేసింది. అందుకే దర్యాప్తు కొనసాగడం, ఫలానా వ్యక్తిని అరెస్టు చేశారన్న ప్రచారం, విచారణ క్రమం మొదలైనవన్నీ తీవ్రంగా చర్చనీయాంశాలు అవుతున్నాయి. ఈ సకల వ్యవహారాలలోనూ పత్రికలలో కథనాలు భేతాళుడి కథలాగా నిరంతరం కొనసాగుతున్నాయి కానీ ఆరోపణలకు గురైన వారికి శిఖలుపడ్డ సందర్భాలు గుర్తించలేనంత స్వల్పం. మద్యం కేసులో గత ఏప్రిల్‌లో కూడా కేజ్రీవాల్‌ను ప్రశ్నించారు. మళ్లీ గురువారం విచారణకు హాజరు కావాలని సమన్లు పంపించారు. కేజ్రీవాల్ మాత్రం విచారణకు హాజరు కాలేదు. తనకు సమన్లు పంపడమే చట్ట విరుద్ధం, రాజకీయ దురుద్దేశంతో మోపిన ఆరోపణ అని అంటున్నారు. ఈ సమన్లను వెనక్కు తీసుకోవాలని కోరుతున్నారు. ఈడి కేజ్రీవాల్‌కు మరోసారి సమన్లు పంపొచ్చు. ఈ లోగా ఆయన కోర్టుకెళ్లి ముందస్తు బెయిలు కోరవచ్చు. అసలు తనకు సమన్లు జారీచేయడాన్నే న్యాయస్థానంలో సవాలు చేయవచ్చు. ఇ.డి. పంపిన సమన్లను మూడు సార్లు నిరాకరించి విచారణకు హాజరు కాకుండా ఉండవచ్చు. మూడుసార్లు హాజరు కాకపోతే ఇ.డి. ఆయనకు జామీనుకు వీలులేని అరెస్టు వారెంట్ జారీ చేయవచ్చు. కేజ్రీవాల్‌ను ఇరుకున పెట్టడానికి బీజేపీ వ్యూహాలు పన్నడం, ఎత్తులు ఎత్తడం కొత్తకాదు. ఆయనను లొంగదీసుకోవడానికి అనేక ప్రయత్నాలు చేశారు. కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిపక్ష ఐక్య సంఘటన "ఇండియా" లో భాగస్వామి కావడం బీజేపీకి అసలే మింగుడు పడడంలేదు. అందుకని ఆయనను ఇబ్బంది పెట్టడానికి ఏవో సాకులు వెతుకుతూనే ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య నేతలను ఒక్కొక్కరుగా ఇరుకున పెడ్తున్నారు. దిల్లీలో మంత్రి సత్యేంద్ర జైన్‌తో మొదలు పెట్టి, మరో మంత్రి మనీశ్ సిసోడియాను అరెస్టు చేసిన తరవాత ఇ.డి.ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్ విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తోంది. విచిత్రం ఏమిటంటే విచారణ ఇ.డి.నో, సీబీఐనో దర్యాప్తు జరుపుతూ ఉంటే అక్కడి పరిణామాలపై బీజేపీ నాయకులు తగుదునమ్మా అని వ్యాఖ్యానిస్తుంటారు. ఆమ్ ఆద్మీ పార్టీ మద్యం కేసులో అవినీతికి పాల్పడిందని, అందువల్ల సంజాయిషీ ఇచ్చుకోవలసిందేనని బీజేపీ నేతలు బృందగానం ఎత్తుకున్నారు. న్యాయస్థానం పర్యవేక్షణ లేకుండానే ఎవరినైనా అరెస్టుచేసే ధోరణి కొనసాగుతోంది కనకే గురువారం కేజ్రీవాల్ దర్యాప్తునకు హాజరైఉంటే అరెస్టు చేసేవారన్న ఊహాగానాలు జోరుగాసాగాయి. న్యాయమార్గపాలన అంటే మోదీ సర్కారుకు బొత్తిగా గౌరవం లేదు.

లోకసభలో తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహువా మొయిత్రా ప్రభుత్వాన్ని నిలదీయడంలో ప్రసిద్ధులయ్యారు. అదానీ విషయంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తరవాత ప్రభుత్వాన్ని అంతగా బోనులో నిలబెట్టిన వ్యక్తి మహువానే. అదానీకి మోదీకి లంకె పెట్టి ఎవరు మాట్లాడినా కేంద్రంలోని బీజేపీ సర్కారు ఏ మాత్రం భరించలేదు. ముందు కేంద్ర దర్యాప్తు సంస్థల రూపంలోఉన్న వేట కుక్కలను ప్రయోగిస్తుంది. విచారణ పేరుతో వేధిస్తుంది. కుదిరితే అరెస్టుచేసి నిరవధికంగా జైలులో మగ్గేట్టు చేస్తుంది. అక్రమాలను, అవినీతిని బయటపెట్టి వాటికి అవకాశం లేకుండా చేయడం మోదీ ప్రభుత్వ ఉద్దేశం కానేకాదు. ప్రతిపక్షాలను అపఖ్యాతిపాలు చేయడానికి ఈ కరకు చట్టాలను బీజేపీ విచ్చలవిడిగా ఉపయోగించు కుంటుంది. అందులో భాగంగానే మహువా మొయిత్రామీద ఆరోపణలు గుప్పించారు. లోకసభలో ప్రశ్నలు అడగడానికి ఆమె డబ్బు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆమె అయిదేళ్ల కాలంలో మొత్తం 60 ప్రశ్నలు అడిగితే అందులో 59అదానీ వ్యవహారం మీద సంధించినవే. అలాంటప్పుడు మోదీ సర్కారు సహించి ఊరుకుంటుందనుకోవడం భ్రమే. మొయిత్రా మీద వచ్చిన ఆరోపణలను విచారించడానికి గురువారం లోకసభ నైతిక ప్రమాణాల కమిటీ సమావేశం జరిగింది. దీనికి మొయిత్రా హాజరయ్యారు. కాని విచారణపేరుతో ఆమెను అడిగిన ప్రశ్నలు ఏ మహిళకైనా అవమాన కరంగానే ఉంటాయి. అందుకే ఆమె విచారణను బహిష్కరించారు. ఈ కమిటీ సభ్యులుగా ఉన్న ప్రతిపక్ష సభ్యులు కూడా విచారణను బహిష్కరించారంటే మోదీ హయాంలో పార్లమెంటును ఏ స్థాయికి దిగజార్చారో అంచనా వేయవచ్చు. న్యాయా న్యాయాల నిగ్గు తేలాల్సిందే. దానికి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు సహకరించవలసిందే. కానీ ప్రతి అంశాన్ని సొంత ప్రచారంకోసం ఉపయోగించుకోవడానికి అలవాటు పడిన బీజేపీకి న్యాయక్రమంతో సంబంధం లేదు. కావాల్సిందల్లా ప్రచారమే. యు.పి.ఎ. ప్రభుత్వ అవినీతిని బయటపెట్టి దోషుల్ని శిక్షించడానికి తనకు 60 నెలలు అధికారంఇస్తే చాలునని 2004 సార్వత్రిక ఎన్నికలలో అభ్యర్థించిన మోదీ 120 నెలల్లో సాధించిందేమిటో పరిశీలిస్తే కనిపించేది శూన్యమే.

రాజుకున్న ఎన్నికల వేడి

రాజకీయ పార్టీలు జాగ్రత్తమై ఎన్నికల కోసం మానిఫెస్టో తయారుచేసి, పోటీచేసే అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తున్నారు. చెరువులోని చేపలకు ఎరవేసినట్టుగా ఓటర్లను మాయలో ముంచి ప్రసంగాలు చేస్తున్నారు. చట్టపరిధిలో మనిషికి వ్యక్తిగత స్వేచ్ఛ అవసరమే. అలాగే ఓటరుకు వ్యక్తిగత స్వేచ్ఛ ఉంది. కాని ఓటర్ల కోసం కొత్తచట్టం అవసరమనిపిస్తోంది. ఎన్నికలవేళ ఓటర్లను ఆకర్షించేందుకు తయారయ్యే రాజకీయ పార్టీ మానిఫెస్టోను గద్దెనెక్కిన తరువాత అమలుచేయని పార్టీలపై చర్య తీసుకునే చట్టం ప్రస్తుతం చాలా అవసరంగా కనిపిస్తోంది. మానిఫెస్టో ద్వారా ఓటర్లను ఆకర్షించి గద్దె నెక్కిన తర్వాత వాటిని చెత్త బుట్టలో వేస్తే ఓటర్లను మోసం చేయటమేకదా. వివిధ మార్గాలలో ఎన్నోరకాల వస్తువులు ఇస్తామని, రెట్టింపు డబ్బు ఇస్తామని అమాయకుల వద్ద అధికమొత్తంలో కోట్ల రూపాయలు వసూలుచేసి తెల్లవారేసరికి బోర్డు తిప్పేసి ప్రజలను మోసంచేసిన వారిపై తగు చర్యలు తీసుకునే విధంగా ప్రజలను మభ్యపెట్టి ఓట్లువేయించుకున్న వారు కూడా మోసంచేసినట్లే కద.



అందుకే మానిఫెస్టో అమలుచేయని రాజకీయ పార్టీలపై చర్యలు తీసుకునే చట్టం అవసరం. త్వరలో 2024లో జరిగే ఎన్నికల వేడి అందుకున్న నేపథ్యంలో ప్రజాశ్రేయస్సు కోరే ప్రజాసేవచేసే సంస్థలు, మేథావులు ఇటువంటి చట్టం గురించి ఆలోచించాలి.

ఎన్నికలు వచ్చినప్పుడు తగిన విధంగా రాజకీయ పార్టీలు ఒకరిని మించి ఒకరు ఓటర్లకు ఎర విసురుతూనే ఉన్నారు. పేదలు నాకేం ఇస్తుంది ప్రభుత్వం అని ఆలోచిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలే ఏ ప్రభుత్వంలో తమ జీవన ప్రమాణం పెరిగిందని ఆలోచిస్తుంటే, ఉన్నత వర్గాలవారు రోజులు గడవడం కాకుండా శాశ్వత ప్రణాళిక ద్వారా ఎటువంటి అభివృద్ధి జరుగుతుందోనని ఆలోచిస్తున్నారు. ఇదిలాఉండగా, రాజకీయ పార్టీల మోసానికి అడ్డుకట్టవేసే విధంగా చట్టం అవసరమని ప్రజాస్వామ్య వాదులు, మేధావులు ఆలోచిస్తున్నారు. గతం 60 సంవత్సరాల నాటికంటే సుదీర్ఘ ఆలోచనతో ప్రస్ఫుటంగా నాటికంటే ఓటర్ల ఆలోచనలో మార్పు కనిపిస్తోంది. గతంలో ఒక ఫ్యాక్టరీ యజమాని చెప్పినట్లు ఆ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు ఓటు వేసేవారు. అలాగే గ్రామాల్లో భూస్వాములు చెప్పినట్లు కూలి పనిచేసేవారు చేసేవారు. కమ్యూనిస్టులు ప్రజల్లో తిరగడం, భూస్వామ్య వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాటం చేసినపుడు సామాన్య ప్రజలు స్వంత నిర్ణయంతో ఓటు వేయడం మొదలుపెట్టారు. 1982లో యన్.టి.రామారావు పాదయాత్ర ప్రజల్లో చైతన్యం పెంచింది. పార్టీ నాయకులో, గ్రామాధికారులో చెప్పినట్లు వినడం మానేవారు.

ప్రతిపక్ష నాయకుడు సమాజంకోసం సాగిల పడతాననిచెప్పి కులాలవారిగా ప్రచారం చేస్తున్నాడు. అంబేద్కర్ అన్నట్లు కులనిర్మూలన జరగకుండా సమసమాజం సాధ్యం కాదు. కాని ప్రస్తుత రాజకీయాలు అందుకు భిన్నంగా సాగుతున్నాయి. వార్తా పత్రికలలో కూడా కులప్రస్తావన తప్పనిసరైంది. సమాజంలో మనిషి మనుగడకు కులమతాలు అవసరంలేదు. కాని రాజకీయాలు వాటి చుట్టూతిరిగి వాటిని పెంచిపోషిస్తున్నారు. పలనాడు బ్రహ్మనాయుడు కాలంలో సహపంక్తి భోజనాలు, ఆ తరువాత ఉన్నవ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో కులాంతర వివాహాలు జరిగాయి. అంతకుముందే గురజాడ, వీరేశలింగం ఎంతో కృషి చేశారు. ఊరిబైటున్న మాలపల్లి, మాదిగ గూడెంలోని ప్రజలకు ఊరి మధ్యలో ఇళ్ల నిర్మాణం అవసరమని గుర్తించారు. ప్రస్తుతం అపార్టుమెంట్ల నిర్మాణం మొదలైన తరువాత అన్ని మతాలు, కులాలవారు ఒకేచోట నివాసం ఉంటున్నారు. కలిసిమెలిసి బతుకుతున్నారు. ఎవరి కులం ఏమిటో తెలియకుండానే జీవనం సాగిస్తున్నారు. అలాగే ప్రభుత్వాలు ఒకేచోట వందల వేల ఇళ్లు నిర్మించి ఇస్తుంటే కుల, మత విభేదాలు లేకుండా జీవనం సాగిస్తున్నారు. కాని సీట్ల కోసం ఆయా కులాల నాయకులను పార్టీలు పంపి వారికి కులం గుర్తుచేయడం కడు శోచనీయం. కుల మతాలను ప్రజలు మరచిపోతుంటే వాటిని గుర్తుచేసి కుల, మతాలు చిచ్చు రేపటం రాజకీయాలకు తగనిపని. ప్రజల స్వేచ్ఛకు అడ్డుపడటంగానే భావించాలి. ఎన్నికలలో డబ్బుతో సీట్లుకొని గద్దె నెక్కిన తరువాత సొంత సంపాదన మీద దృష్టిసారించి చేసిన వాగ్దానాలకు స్వస్తి పలుకుతున్నారు. ఈ పరిస్థితిలో ఓట్లు అమ్ముకోకుండా తమకు మేలుచేసేవారిని ఎన్నుకునే విధంగా ఓటర్లలో చైతన్యం తీసుకురావాలి. ఈ విషయంలో రాజకీయ పార్టీలకు ఇతర రంగాలలో ప్రగతిశీలులైన యువత ఆ బాధ్యత తీసుకోమని సమాజశ్రేయస్సు కోరే యువత అందుకు ముందడుగు వేస్తుందని ఆశిద్దాం.

వెట్టి చాకిరీ తలపించే డెబ్బై గంటలు

డా. సోమ మర్ల

ఇటీవల ప్రముఖ సాఫ్టవేరు కంపెనీ "ఇన్ఫోసిస్" స్థాపకులు నారాయణమూర్తి ఐటి ఉద్యోగులు వారానికి కనీసం 70 గంటలు శ్రమించాలని, ఇది ఆర్థికాభివృద్ధికి, దేశప్రగతికి ఆవశ్యమని సెలవిచ్చారు. వెంటనే అనేక పారిశ్రామిక దిగ్గజాలు ఈ ప్రతిపాదనను బలపర్చారు. గత రెండు శతాబ్దాలుగా కార్మికవర్గం సుదీర్ఘ పోరాటాలు, త్యాగాల ఫలితంగా స్థాపించుకున్న ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనాలు, తదితర హక్కులు ప్రస్తుత నయాఉదారవాద ఆర్థికయుగంలో తారుమారు కావటం ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించనీయరాదు.

మే డే పోరాట త్యాగాలు: గత రెండున్నర శతాబ్దాలుగా కార్మికుడు రోజులో ఎన్ని గంటలు శ్రమించాలన్న శ్రమకు, పెట్టుబడికి మధ్య సంఘర్షణగా కొనసాగుతూనే వస్తున్నది. చికాగోలో ప్రారంభమైన మే డే నుండి సింగరేణి, విశాఖ వరకు ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం కొనసాగిస్తున్న పోరాటాల ఫలితంగా ఇరవయ్యవ శతాబ్దం మధ్యనాటికి ఎనిమిది గంటల పనిదినాల్ని కనీసం సంఘటిత కార్మికులకు పరిశ్రమల్లో అమలుచేయక తప్పలేదు. అక్టోబరు రష్యన్ విప్లవ విజయంతో వారానికి 48గంటలు, కనీసవేతనం, బాల కార్మికవ్యవస్థ రద్దు, పనిభద్రత, బీమా, పెన్షన్ వగైరా హక్కులను కార్మికవర్గం సాధించుకోగలిగింది. తద్వారా ఎనిమిది గంటల పనిదినాల్ని ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 'కన్వెన్షన్ 1" ద్వారా ఆమోదించారు.

పద్దెనిమిది, పందొమ్మిదవ శతాబ్దాలకాలంలో కార్మికులు రోజుకి పద్నాలుగు నుండి పద్దెనిమిది గంటలవరకు ఫ్యాక్టరీలలో శ్రమించేవారు. ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో బాలకార్మికులు రోజంతా పనిచేసి కలకత్తా వీధుల్లో రోడ్లప్రక్కనే రాత్రి సమయంలో నిద్రపోవటాన్ని, వినటానికే బాధ కలుగుతుంది. పందొమ్మిదవ శతాబ్దపు ఇంగ్లాండులోని కార్మికులు భరించిన గడ్డు పరిస్థితులను ఫ్రెడరిక్ ఏంగెల్స్ 'ఇంగ్లాండులో కార్మికుల స్థితిగతులు" అనే గ్రంథంలో చక్కగా వివరిస్తాడు. అధిక లాభాలపై పరిశ్రమల యజమానులు పనిగంటలను పెంచటం, నూతన యంత్రాలు (వేగవంతమైన)తో కార్మికుల నుండి శ్రమశక్తిని, దోపిడీని అధికంచేసి అదనపు విలువను పెంచుకొని అధిక లాభాలను ఎలా పొందుతారో కార్ల్‌మార్క్స్ "క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి" (1859) లో చక్కగా వివరిస్తాడు. అధిక పనిగంటల విధానం "ప్రాథమిక పెట్టుబడి పోగుచేయడానికి" తోడ్పడుతుందని కార్ల్‌మార్క్స్ వివరిస్తాడు.

అసంఘటిత కార్మికుల దుస్థితి:

1870వ సంవత్సరంలో ఐరోపాలో సగటు కార్మికుడు వారానికి 70గంటలు, 1920లో 60 గంటలు 1950 నాటికి రోజుకి 8 గంటలకు పనిగంటలు తగ్గుతూ వచ్చాయి. కాగా మన దేశంలో కార్మికవర్గంలో దాదాపు 90శాతంగా ఉన్న చిరు వ్యాపారాల్లో, సొంత వ్యాపారాల్లో పనిచేసే కార్మికులకు ఎనిమిది గంటలకు మించి పనిచేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు, పనిభద్రత, యూనియన్ నిర్మించుకునే హక్కులు, బోనస్ తదితర హక్కులు ఏమాత్రం వర్తించవు. ప్రస్తుతం ఉదారవాద ఆర్థిక సంస్కరణల అమలు నేపథ్యంలో భారీ పరిశ్రమల్లో సైతం "కాంట్రాక్టు నియామకాలు"తో పదవీవిరమణ వరకు కొనసాగే నియామకాల స్థానంలో పరిమిత కాలవ్యవధితో కూడిన స్వల్పకాలిక ఉద్యోగాలు వచ్చాయి. వీరికి కనీసవేతన చట్టం వర్తించదు. యూనియన్ ఏర్పరచుకునే హక్కు అంతంత మాత్రం. గ్రామీణప్రాంతాల్లో వ్యవసాయం గడ్డు పరిస్థితి నెదుర్కోవడంతో వలసలు పెరిగి పట్టణాల్లో రిజర్వు కార్మికుల సంఖ్య హెచ్చి నిరుద్యోగం అధికంగా పెరిగింది. దీనినే అదునుగా చేసుకొని పరిశ్రమల్లో, భవన నిర్మాణ, సేవారంగాల్లో వేతనాలను గణనీయంగా తగ్గించి వేశారు. అతి స్వల్ప వేతనాలు, అధిక పనిగంటలు, ఉద్యోగభద్రత లేకపోయినా ఈ కార్మికులు సృష్టించిన సంపద కారణంగానే అతి త్వరలో భారతదేశం ఐదు ట్రిలియన్ డాలర్లతో మూడవ ఆర్థిక దిగ్గజంగా ఎదగడానికి ఉవ్విళ్లూరుతున్నది. సంపద విభజనలో అంతరాల కారణంగా ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయి. "గ్లాస్ డోర్" అనే సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, తలసరి కార్మికుని వేతనం పన్నెండు వేల రూపాయలు కాగా, నేడు దేశంలో బిలియనీర్లు, డాలరు కోటీశ్వరుల సంఖ్య 169కి చేరింది.

సాఫ్ట్‌వేరు ఇంజనీర్లు కూడా వేతన కార్మికులే

ఉత్పత్తిరంగంలో విరివిగా వ్యాప్తిలోకి వస్తున్న "యాంత్రిక మేథస్సు, రోబోట్లు, ఆటోమేషన్" కారణంగా క్రమంగా కార్మికుల సంఖ్య తగ్గుతున్నది. ఇది వాస్తవమే కానీ కంప్యూటర్ల ప్రవేశం, వేగవంతమైన 'ఎసెంబ్లీ' ప్లాంట్లు, మొబైలు ఫోన్ల ఉత్పత్తి నుంచి కార్ల పరిశ్రమవరకు చేరటంతో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులపై పనిఒత్తిడి చాలా అధికమైంది. ఒక నిమిషానికి ఎసెంబ్లీ బెల్టుపై కార్మికుడు దాదాపు 14 పనులు చేయవలసివస్తున్నది. కనీసం మరుగుదొడ్డికి వెళ్లడానికో, మంచినీటికో కొన్ని నిమిషాలు అతడు లేకపోయినా, ఉత్పత్తి ఆగిపోతుంది. విపరీతమైన నష్టం వస్తుంది. వీరి పరిస్థితి దుర్భరం. నోయిడా, కొయంబత్తూరు వంటి కార్ల పరిశ్రమల్లో 2023వ సంవత్సరంలో దాదాపు 45.8 లక్షల కార్లు, అసెంబుల్డ్ పరిశ్రమల్లో ఉత్పత్తి అయినా అక్కడి శ్రమించే కార్మికులు జీవన పరిస్థితులు మెరుగవలేదు.

సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు, బ్యాంకు ఉద్యోగులను కార్మికులుగా పరిగణించరు. కానీ, పరిశ్రమల్లో, బ్యాంకుల్లో అత్యావశ్యకమైన కంప్యూటర్ కోడ్‌ను రచించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కనీసం రోజుకి అనేక గంటలు శ్రమిస్తేకానీ, కొత్త ఉత్పత్తిశక్తులు ఆవిర్భవించవు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టరు సైతం ప్రారంభంలో 25వేల రూపాయల వేతనం పొందడంలేదు. వీరంతా కూడా పరిశ్రమల్లోని కార్మికుల వలే యజమానులు చెల్లించే వేతనాలపై ఆధారపడే కార్మికులే.

ప్రస్తుత భారతీయ జనతాపార్టీ సైతం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లు గత అనేకసంవత్సరాలుగా దేశంలోని కార్మికవర్గం సుదీర్ఘపోరాటాల ఫలితంగా సాధించుకున్న అనేక కార్మిక చట్టాలు తిరస్కరణకుగురయ్యాయి. అనేక పరిశ్రమల్లో యూనియన్ నిర్మించుకున్న హక్కులను సైతం హరించివేస్తున్నాయి. పనిగంటల పెంపుతో కార్మికుడి ఏకాగ్రత తగ్గి ఉత్పత్తిపై ప్రభావం చూపడమే కాక రోజుకి 12గంటల పనితో అతడి ఆరోగ్యం సైతం బాగా దెబ్బతింటుంది. ఒక కార్మికుడి విరామానికి సాంస్కృతిక కార్యకలాపాలలో పాల్గొని కుటుంబంతో గడిపే సమయం బాగా తగ్గిపోతుందది. ఫలితంగా ఉత్పాదకత తగ్గుతుంది. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోపరేషన్ అభివృద్ధి(ఓయుసీడీ) అంచనా ప్రకారం, అధిక పనిగంటల విషయంలో 187దేశాలోల మన స్థానం 136 మాత్రమే. కాగా, అనేక ఐరోపా దేశాల్లో, ఆస్ట్రేలియా, అమెరికాల్లో పనిగంటలు 20నుండి 30 గంటలతో నాలుగురోజుల వారానికి తగ్గించారు. కార్మికుడు ఎక్కువ గంటలు పనిచేస్తే ఉత్పాదకత తగ్గిపోతుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

భారత్ మూడవ ఆర్థిక అగ్రరాజ్యం కావడం కంటే కార్మికుల ఆదాయం, ఆరోగ్యం కుటుంబాల్లో సుఖ సంతోషాలు ముఖ్యం. కార్మికులను మరింత దోపిడీ చేయాలనే సంకల్పంతో ప్రతిపాదిస్తున్న పనిగంటల పెంపును దుర్మార్గమైన కార్మిక కోడ్‌లను సంఘటిత, అసంఘటిత కార్మికులు ఐక్యంగా పోరాటాల్ని చేసి తిప్పికొట్టాలి.

వ్యక్తిగత సమాచార గోప్యతకు ఎసరు

డా. యం.సురేష్ బాబు

వ్యక్తిగత సమాచార గోప్యత అన్నది దేవత వస్త్రంగా తలపిస్తున్నది. సమాచార భద్రత అనేది ఒక ఊహలా మిగిలింది. ఆథార్ డేటా లీక్ ఉల్లంఘన డార్క్ వెబ్‌లో 81 కోట్ల మంది భారతీయుల వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేసింది. బిజినెస్ స్టాండర్డ్ నివేదిక ప్రకారం, 81.5 కోట్ల మంది భారతీయులు వ్యక్తిగత గుర్తింపు సమాచారం డార్క్ వెబ్‌లో లీక్ అయినట్లు అమెరికాకు చెందిన సైబర్ సెక్యూరిటీ సంస్థ రెస్యూరిటీ పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం, పేర్లు, ఫోన్‌నంబర్‌లు, చిరునామాలు, ఆధార్, పాస్‌పోర్ట్ సమాచారం సహా డేటా ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంది. బ్లాగ్‌పోస్ట్‌లో భద్రత ఇలా వ్రాశాడు "అక్టోబర్ 9న, జూషఅ 0001 పేరుతో ఒక సైబర్ ఆగంతకుడి బెదిరింపు సందేశం బ్రీచ్ ఫోరమ్‌లలో ఒక థ్రెడ్‌ను పోస్ట్ చేశాడు. 815 మిలియన్ల "ఇండియన్ సిటిజన్ ఆధార్, పాస్‌పోర్ట్" రికార్డులకు బ్రోకింగ్ యాక్సెస్. "ముఖ్యంగా, భారతదేశం మొత్తం జనాభా 140 కోట్లకు పైగా ఉంది." డార్క్ వెబ్‌లో 81.5 కోట్ల మంది భారతీయులకు సంబంధించిన సున్నితమైన సమాచారం వెలువడింది, ఇది భారతదేశ చరిత్రలో అతిపెద్ద డేటా ఉల్లంఘనగా గుర్తించవచ్చు. దొంగిలించిన సమాచారాన్ని డార్క్ వెబ్‌లో ప్రచారం చేసిన 'జూషఅ 0001' హ్యాకర్ ద్వారా లీక్‌ని దృష్టికి తీసుకొచ్చారు. కొవిడ్-19 టెస్టింగ్ సమయంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సేకరించిన డేటా నుండి ఈ సమాచారం వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, లీక్ గురించి కేంద్రం ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇంకా మొద్దు నిద్రలో ఉన్నట్లుంది. హ్యాకర్ షేర్ చేసిన డేటా ప్రకారం, దొంగిలించిన సమాచారంలో లక్షలాది మంది భారతీయుల పేర్లు, ఫోన్ నెంబర్లు, తాత్కాలిక, శాశ్వత చిరునామాలతో పాటు ఆధార్, పాస్‌పోర్ట్ వివరాలు ఉంటాయి. కోవిడ్-19 పరీక్ష సమయంలో ఐసిఎంఆర్ సేకరించిన సమాచారం నుండి ఈ డేటా వచ్చిందని కూడా హ్యాకర్ పేర్కొన్నాడు.

వైద్య డేటా లోని డేటా ఉల్లంఘనలు వ్యక్తులకు గణనీయమైన హాని కలిగిస్తాయి. ఇందులో గుర్తింపు దొంగతనం, వైద్య గుర్తింపు దొంగతనం (మోసపూరితంగా వేరొకరి పేరుతో వైద్య సేవలు పొందడం) సున్నితమైన వైద్య పరిస్థితులను బహిర్గతం చేయడం వంటివి ఉంటాయి. అటువంటి ఉల్లంఘనల పరిణామాలు ఆర్థిక నష్టానికి మించి విస్తరించవచ్చు. ఇది మితిమీరి ఒక వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేయవచ్చు. గుప్తీకరణ, యాక్సెస్ నియంత్రణలు సాధారణ భద్రతా ఆడిట్‌లతో సహా వైద్యడేటాను రక్షించడానికి ఆరోగ్య సంరక్షణ సంస్థలు తప్పనిసరిగా పటిష్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలి. ఉద్యోగులకు శిక్షణ అవగాహన కార్యక్రమాలు కూడా కీలకమైనవి, మానవ తప్పిదాలు లేదా అంతర్గత బెదిరింపుల కారణంగా అనేక డేటా ఉల్లంఘనలు జరుగుతాయి. డేటా ఉల్లంఘన జరిగినప్పుడు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు, సంస్థలు అవసరమైనప్పుడు బాధిత వ్యక్తులు, నియంత్రణ అధికారులు, మీడియాకు తక్షణమే తెలియజేయాలి. ప్రభావిత రోగులకు క్రెడిట్ పర్యవేక్షణ సేవలను అందించడం వంటి ఉల్లంఘన ప్రభావాన్ని తగ్గించడానికి సమర్థవంతమైన ప్రతిస్పందన ప్రణాళిక ఉండాలి. హ్యాకర్‌తో పరిచయాన్ని ఏర్పరచుకున్న దాని హంటర్ యూనిట్ పరిశోధకులు, వారు మొత్తం ఆధార్ భారతీయ పాస్‌పోర్ట్ డేటాబేస్‌ను 80,000డాలర్లకి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నారని తెలుసుకున్నారు. మీడియా నివేదికల ప్రకారం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ప్రస్తుతం హ్యాకర్ "జూషఅ0001" ద్వారా కనుగొన్న ఉల్లంఘనపై దర్యాప్తు చేస్తోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డేటాబేస్ నుంచి డేటాను తస్కరించి ఉండవచ్చని న్యూస్ 18 మరో నివేదిక పేర్కొంది. "భారతదేశంలో డేటా ఉల్లంఘన తెలియని హ్యాకర్లు 800 మిలియన్లకు పైగా కోవిడ్ 19 భారతీయుల వ్యక్తిగత డేటా లీక్ చేశారు. లీక్ అయిన డేటాలో పేరు, తండ్రి పేరు, ఫోన్ నంబర్, ఇతర నంబర్, పాస్‌పోర్ట్ నంబర్, ఆధార్ నంబర్, వయస్సు వివరాలు ఉన్నాయి. న్యూస్18 నివేదిక ప్రకారం, కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆఫ్ ఇండియా కూడా ఉల్లంఘన గురించి ఐసిఎంఆర్‌ని అప్రమత్తం చేసింది. కోవిడ్ 19 పరీక్ష సమాచారం నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్, ఐసిఎంఆర్ ఆరోగ్య మంత్రిత్వశాఖ వంటి వివిధ ప్రభుత్వ సంస్థలలో చెల్లాచెదురుగా ఉంది. ఉల్లంఘన ఎక్కడ ఉద్భవించిందో గుర్తించడం సవాలుగా ఉంది. ఇప్పటివరకు, ఆన్‌లైన్‌లో సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ లేదా ఇతర సంబంధిత ఏజెన్సీల నుండి లీక్‌పై ఎటువంటి స్పందన లేదు. భారతదేశంలోని ఒక పెద్ద వైద్య సంస్థ ఉల్లంఘనను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. ఈ సంవత్సరం ప్రారంభంలో, సైబర్ నేరగాళ్లు

ఎయిమ్స్ సర్వర్‌లను హ్యాక్ చేసి, ఇన్‌స్టిట్యూట్‌లో ఒక టెరాబైట్ కంటే ఎక్కువ డేటాను స్వాధీనం చేసుకున్నారు. ఇది ఆసుపత్రిని 15 రోజులపాటు మాన్యువల్ రికార్డ్ కీపింగ్‌కి మార్చవలసి వచ్చింది. ఇప్పటికే రద్దీగా ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లో అన్ని ప్రక్రియలు మందగించాయి. దీనికి కొన్ని నెలల ముందు డిసెంబరు 2022లో, ఢిల్లీలోని ఎయిమ్స్ డేటాను చైనీయులు హ్యాక్‌చేసి, క్రిప్టోకరెన్సీ రూపంలో రూ.200 కోట్లు డిమాండ్ చేశారు. దుర్బలత్వాలను గుర్తించడానికి, ఉల్లంఘనలను నివారించడానికి డేటా సిస్టమ్‌ల రెగ్యులర్ పర్యవేక్షణ ఆడిటింగ్ కీలకం. బెదిరింపులను పరిష్కరించడానికి భద్రతా చర్యలు నిరంతరం నవీకరించాలి. వ్యక్తుల గోప్యత, ఆరోగ్యం శ్రేయస్సుకు హాని కలిగించే సంభావ్యత కారణంగా సున్నితమైన వైద్య డేటాతో కూడిన డేటా ఉల్లంఘనలు ప్రత్యేకించి సంబంధించిన సంస్థలు ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు ఈ విషయాలను తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యక్తిగత సమాచార గోప్యత పరిరక్షణ ప్రథమ కర్తవ్యంగా ప్రభుత్వం భావించాలి.

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

రాజస్తాన్ కాంగ్రెస్‌కు కొత్త చిక్కులు



- టికెట్ల విషయంలో అంతర్గత పోరు
- అభ్యర్థుల ఎంపికపై నిరసనలు
- అందరినీ సంతృప్తి పర్చడం సాధ్యం కాదు: గెహ్లాట్

జైపూర్: రాజస్తాన్‌లో వరుసగా రెండోసారి విజయం సాధించడం ద్వారా చరిత్రను తిరగరాయాలన్న కాంగ్రెస్ పార్టీకి కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. ఈ రాష్ట్రంలో నవంబర్ 25న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ఆ పార్టీ మంగళవారం నాలుగు, ఐదో జాబితాలను మంగళవారం విడుదల చేసిన తర్వాత రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు వ్యక్తం చేయడంతో పార్టీలో అంతర్గత పోరు తెరపైకి వచ్చింది. తాము ఎంపిక చేసిన నేతలకు టికెట్లు నిరాకరించడంపై కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. ఈ నిరసనలు కాంగ్రెస్ అధి నాయకత్వానికి, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి. అయితే అందరినీ సంతృప్తిపర్చడం సాధ్యం కాదని... టికెట్ నిరాకరించిన వారినినామినేటెడ్ పోస్టుల్లో నియమిస్తామని గెహ్లాత్ తెలిపారు. మొత్తం 200 అసెంబ్లీ స్థానాలకు గాను కాంగ్రెస్ 156 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించగా... మంత్రులు శాంతి ధరివాల్, మహేశ్ జోషి, ఆ పార్టీ నేత ధర్మేంద్ర రాథోడ్ గురించి ప్రధానంగా చర్చ జరుగుతోంది. వీరు గత ఏడాది పార్టీ అధ్యక్ష ఎన్నికలకు ముందు తిరుగుబాటుకు పాల్పడినందుకు కేంద్ర నాయకత్వం ఈ ముగ్గురికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఇంకా అభ్యర్థిని ప్రకటించని హవామహల్ నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మహేష్ జోషికి టికెట్ ఇవ్వాలంటూ జైపూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం కార్యకర్తలు నిరసనకు దిగారు. అయితే జోషి తిరుగుబాటు విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్లడం, అతని కుమారుడు అత్యాచారం అభియోగాన్ని ఎదుర్కొంటున్నందున ఈ స్థానం నుంచి జైపూర్ అధ్యక్షుడు ఆర్ఆర్ తివారీకి పార్టీ టికెట్ ఇవ్వవచ్చని తెలుస్తోంది. ధరివాల్ పైకి గెహ్లాత్‌కు సన్నిహితుడిగా కనిపిస్తారు. అయితే తిరుగుబాటు ఎమ్మెల్యేలు సెప్టెంబర్ 25, 2022న జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశానికి హాజరు కాకుండా అతని నివాసంలో సమావేశాన్ని నిర్వహించారు. ధరివాల్ కూడా గెహ్లాతే అసలైన హైకమాండ్ అంటూ వ్యాఖ్యానించారు.

గత నెలలో జరిగిన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో, పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన పేరును సంభావ్య జాబితాలో చేర్చడంపై అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారు అలాంటి జాబితాలో ఉండవచ్చా అని అడిగారని తెలిసింది. అయితే ముఖ్యమంత్రితో విరోధం రాకుండా ఉండేందుకు ధరివాల్‌కు టికెట్ ఇచ్చే అవకాశం ఎక్కువగా ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ధర్మేంద్ర రాథోడ్ పోటీ చేస్తారా లేదా అనే విషయంపై స్పష్టత లేదు.

నిర్మాణాత్మక సమస్యలు

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇప్పటివరకు ఆచి తూచి ముందడుగు వేసింది. అయితే మంగళవారం కొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో నిరసనలు ప్రారంభమయ్యాయి. రాజకీయ వ్యూహకర్త అమితాబ్ తివారీ మాట్లాడుతూ...బీజేపీ, కాంగ్రెస్ రెండూ టికెట్ల పంపిణీలో సమస్యలను ఎదుర్కొంటున్నాయని అన్నారు. అయితే గత మూడు ఎన్నికలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రెండు సార్లు సాధారణ మెజారిటీ (101) ని సాధించలేకపోయినందున ఈ సమస్య కాంగ్రెస్‌కు పెద్దదని చెప్పారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్‌కు నిర్మాణపరమైన సమస్యలు ఉన్నాయి... గత మూడు ఎన్నికల్లో ఎన్నడూ గెలవని 54 సీట్లు ఉన్నాయి. వాస్తవానికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 146 సీట్లలో 101 సీట్లు గెలవాల్సి ఉంటుంది. అందుకే వారు కొన్నిసార్లు 96 స్థానాలతో, కొన్నిసార్లు 99 స్థానాలతో వెనకబడి పోయారు. ఓడిపోయినప్పుడు, తీవ్రంగా నష్టపోతారు. ఎందుకంటే వారి బలమైన స్థానాలు చాలా తక్కువగా ఉన్నాయి. కాబట్టి 19 నియోజకవర్గాల్లో మాత్రమే ఎన్నడూ గెలవని బీజేపీతో పోలిస్తే తిరుగుబాటు కాంగ్రెస్‌కు పెద్ద సమస్య' అని తివారీ అన్నారు.

ఇతర కారణాలు

ఎన్నికలకు ముందు సచిన్ పైలట్-అశోక్ గెహ్లాత్ వైరం ప్రభావం కాంగ్రెస్‌పై కూడా ఉంది. అయితే పార్టీకి అనుకూలంగా పని చేసేది గెహ్లాత్ పలుకుబడి, మంచి రాజకీయ ప్రవృత్తి. 2018లో 12 మంది స్వతంత్రుల మద్దతుతో విశ్వాసం తీర్మానం నెగ్గిన ఆయన... ఈసారి వారికి కాంగ్రెస్ టికెట్లు కట్టబెట్టారు. ఇక పైలట్ అయితే పార్టీ గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి ఎవరనేది తానే నిర్ణయిస్తానని చెబుతున్నారు. అంటే తనకు కూడా పార్టీ అధిష్ఠానం ఏదో వాగ్దానం చేసినట్లు కనబడుతోంది. కాగా బీజేపీ ఒక సిద్ధాంతానికి అనుగుణంగా మసలే కార్యకర్తలున్న పార్టీ కాబట్టి వారు గుజరాత్‌లో చేసినట్లుగా సిట్టింగ్ ఎమ్మెల్యేలను వదులుకోవడం, మంత్రివర్గ సభ్యులను మార్చుకోవడం బీజేపీకి సులభమని తివారీ అభిప్రాయపడ్డారు. అదే కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఏ శాసనసభ స్థానంలోనైనా కార్యకర్తల్లో మొదటి నలుగురి నుండి ఐదుగురు నాయకుల మధ్య చీలిక ఉంటుంది కాబట్టి ఒక వ్యక్తికి టికెట్ వచ్చినప్పుడు, ఇతర నాయకులకు విధేయులైన కార్యకర్తలు పనిచేయరని స్పష్టం చేశారు. రాజస్థాన్ బీజేపీలో కూడా మనం సమస్యలు చూస్తున్నప్పటికీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత, సాపేక్షంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు అతనికి లేదా ఆమెకు మద్దతు ఇచ్చేలా సిద్ధాంతం నిర్ధారిస్తుంది అని తివారీ పేర్కొన్నారు. అయితే కార్యకర్తల నిరసనలపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ... అధికారంలో ఉన్న పార్టీ టికెట్ కావాలని అభ్యర్థులు కోరుకోవడం, తిరస్కరించబడినప్పుడు అసంతృప్తికి గురవడంలో ఆశ్చర్యమేమీలేదని పేర్కొంది. 'టికెట్లు ఒక ప్రక్రియ ఆధారంగా, సర్వేలు, సంప్రదింపుల ఆధారంగా నిర్ణయించబడతాయి. దానికి సమయం పడుతుంది. కొంతమందికి నిరాశ చెందడం సహజం. గెలిచిన పార్టీలో కొంత అసంతృప్తి ఉండటం సహజం' అని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా అన్నారు.

ఆప్ మంత్రి నివాసంలో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)పై మోదీ సర్కారు కక్షసాధింపు రోజురోజుకు పెరుగుతోంది. ఆప్ నాయకులు, మంత్రులను వరుసగా కేసుల్లో ఇరికిస్తోంది. మద్యం కుంభకోణం కేసులో ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసిన నాలుగు రోజుల వ్యవధిలోనే... అదే పార్టీకి చెందిన మరో నేత నివాసంలో గురువారం సోదాలు చేపట్టింది. ఢిల్లీ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ ఇంట్లో తనిఖీలు చేసింది. మనీ లాండరింగ్ కేసుతో సంబంధముందన్న అనుమానంతో ఈడీ ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. గురువారం తెల్లవారుజామునే అధికారులు మంత్రి ఇంటికి చేరుకొని సోదాలు మొదలుపెట్టారు. రాజ్‌కుమార్ ఆనంద్ ఢిల్లీ సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తమ నేతలపై ఈడీ దాడులను ఆప్ తీవ్రంగా ఖండించింది. దర్యాప్తు సంస్థల ద్వారా కేంద్ర ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా ఈ దాడులు నిర్వహిస్తోందని ఆరోపించింది. ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా 2022 జులై 20న కేంద్ర హోంశాఖకు లేఖ రాయడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్టు చేసింది. ఇప్పటికీ ఆయనకు బెయిల్ లభించలేదు. ఇటీవల ఆప్ నేత సంజయ్‌సింగ్‌ను మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసింది. తాజాగా మరో నేత నివాసంలో సోదాలు చేపట్టింది.

కర్నాటకలో జికా వైరస్ కలకలం

బెంగళూరు: కర్నాటకలో జికా వైరస్ కలకలం సృష్టిస్తోంది. చిక్కబళ్లాపూర్ జిల్లాలో గురువారం కొత్త కేసు నమోదైంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం...రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న వారిలో వంద మంది నుంచి నమూనాలు సేకరించారు. వీటిని పరీక్షించగా ఒకరికి జికా పాజిటివ్ వచ్చింది. ఈ వ్యాధి సోకిన వ్యక్తి నివాసప్రాంతం చిక్కబళ్లాపూర్ కావడంతో వైద్యవర్గాలు అప్రమత్తమయ్యాయి. ఆగస్టులోనే ఈ నమూనా పరీక్షలు నిర్వహించగా...అక్టోబరులో వీటి ఫలితాయి వచ్చినట్టు సమాచారం. దీంతో చిక్కబళ్లాపూర్‌లో దోమలను సేకరించి పరీక్షకు పంపగా... వాటిలో ఈ వైరస్ ఉన్నట్లు తేలింది. దీంతో వైద్యాధికారులు జికా వైరస్ అనుమానిత ప్రాంతాలకు హెచ్చరిక జారీ చేశారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ముగ్గురి నమూనాలను పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపారు. గతేడాది కర్నాటకలో తొలి జికా కేసు నమోదైంది. రాయచూర్ జిల్లాలో ఐదేళ్ల చిన్నారికి జికా వైరస్ సోకినట్లు గుర్తించారు. జికా వైరస్‌కు ఏడెస్ దోమ వాహకంగా పనిచేస్తుంది. తొలిసారి ఈ వైరస్‌ను 1947లో ఆఫ్రికా ఖండంలో గుర్తించారు. జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, కీళ్లనొప్పులు, కళ్లు ఎర్రగా మారడం, కండరాల నొప్పి దీని లక్షణాలు. మహిళలు గర్భధారణ సమయంలో ఈ వైరస్ బారిన పడితే శిశువులు కొన్ని అవలక్షణాలతో పుట్టే ప్రమాదం ఉంది. ఈ వైరస్ ద్వారా మరికొన్ని వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నట్లు తేలింది.

విజయన్‌కు బెదిరింపు ఫోన్ కాల్

తిరువనంతపురం: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. సీఎం విజయన్‌ను చంపేస్తానని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయానికి ఓ అగంతకుడు ఫోన్ చేశాడు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. మరోవైపు ఈ ఫోన్ చేసింది మైనర్ బాలుడని స్థానిక మీడియా కథనాలు తెలిపాయి. ఫోన్ కాల్‌పై అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కొద్దిరోజుల క్రితం కేరళలోని కలమస్సేరిలో ఓ ప్రార్థనా సమావేశంలో వరుస బాంబు పేలుళ్లు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, 52 మంది గాయపడ్డారు. బాంబు పేలుళ్లకు తానే బాధ్యుడినని పేర్కొంటూ త్రిసూర్‌కు చెందిన డొమినిక్ మార్టిన్ అనే వ్యక్తి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఈ క్రమంలో సీఎంకు బెదిరింపులు రావడంతో పోలీసుశాఖ ఉలిక్కిపడింది. గతంలోనూ అనేకమార్లు విజయన్‌ను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఈడీ అధికారులు

జైపూర్: లంచం తీసుకుంటూ ఇద్దరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు పట్టుబడ్డారు. రాజస్తాన్‌లో ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది.ఇద్దరు ఈడీ అధికారులు లంచం తీసుకుంటుండగా పట్టుబడినట్లు రాజస్తాన్ అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) ఓ ప్రకటనలో తెలిపింది. చిట్‌ఫండ్ వ్యవహారంలో కేసు నమోదు చేయకుండా ఉండేందుకు వారు రూ.15 లక్షలు అడిగినట్లు అధికారులు తెలిపారు. వారి కార్యాలయాల్లోనూ సోదాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ కుమారుడు వైభవ్‌ను ఈడీ మూడు రోజుల క్రితం విచారించిన సంగతి తెలిసిందే. విదేశీ మారకపు నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై సుమారు తొమ్మిది గంటల పాటు ప్రశ్నలు కురిపించింది. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు కేవలం నెలరోజుల ముందు ఈడీ విచారణపై అశోక్ గెహ్లాత్ ధ్వజమెత్తారు. ఈ చర్యను రాజకీయ ప్రతీకార చర్యగా పేర్కొన్నారు.

రాజస్తాన్ పీసీసీ అధ్యక్షుడి కుమారులకు సమన్లు

జైపూర్: కొద్దిరోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్తాన్‌లో ఈడీ సోదాలు కలకలం రేపుతున్నాయి. పీసీసీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ డోటాస్రా కుమారులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీచేసింది. పరీక్ష పత్రం లీక్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా వారికి ఈ నోటీసులు అందాయి. కొద్దిరోజుల క్రితం రాజస్థాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ సింగ్ డోటాస్రా నివాసంలో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ కుమారుడు వైభవ్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. ఫెమా నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన కేసులో వైభవ్‌కు ఈ సమన్లు అందినట్లు తెలిసింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈడీ సమన్లు ఇవ్వడం, సోదాలు చేపట్టడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఈ చర్యలపై ఇదివరకు ముఖ్యమంత్రి గెహ్లాత్ ట్విటర్ వేదికగా స్పందిస్తూ కేంద్రంపై ధ్వజమెత్తారు. 200 శాసనసభ స్థానాలున్న రాజస్తాన్‌లో నవంబరు 25న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 3న ఫలితాలు ప్రకటించనున్నారు.

తమిళనాట దళితులపై దాడి

బట్టలూడదీసి...మూత్రం పోసి...

తిరునల్వేలి: తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మద్యం సేవించిన యువకులు...దళితులపై దాష్టీకానికి తెగబడ్డారు. దళిత యువకులను చితకబాది.. బట్టలూడదీసి.. వారిపై మూత్రం పోశారు. అక్టోబరు 30న తచ్చనల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ సహా అనేక సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తార్యైయూత్తుకు చెందిన పొన్నుమణి (25), పాలయంకొట్టయ్ సమీపంలోని తిరుమలైకొజుంతుపురానికి చెందిన నల్లముత్తు (21), ఆయిరామ్ (19), రామర్ (22), శివ (22), లక్ష్మణన్ (22)లపై అనేక సెక్షన్ల కింద కేసు నమోదైంది. కేసు వివరాల్లోకి వెళ్తే... బాధితులు మనోజ్ కుమార్, అతడి స్నేహితుడు మరియప్పన్ అక్టోబరు 30న తమ ఊరు సమీపంలోని నదికి స్నానం కోసం వెళ్లారు. స్నానం ముగించుకుని తిరిగొస్తుండగా... నదీ తీరంలో మద్యం సేవిస్తున్న ఆరుగురు యువకులు వారిని అడ్డుకున్నారు. మీ కులం ఏంటి? మీది ఏ ప్రాంతం అని ప్రశ్నించారు. తాము దళిత సామాజిక వర్గానికి చెందినవారమని బాధితులు చెప్పడంతో రెచ్చిపోయి దాడికి దిగారు. అంతటితో ఆగకుండా ఒంటిపై ఉన్న బట్టలు ఊడదీశారు. వారిపై మూత్రం పోశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన మనోజ్, మరియప్పన్‌లను కుటుంబసభ్యులు తిరునల్వేలి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. తాము దళితులమని చెప్పడంతో దారుణంగా వ్యవహరించారని, రాత్రి పొద్దుపోయే వరకూ తమను నిర్బంధించారని బాధిత యువకులు వెల్లడించారు. తమ వద్ద ఉన్న రూ.5,000 నగదు, మొబైల్ ఫోన్స్, ఏటీఎం కార్డులు లాక్కున్నారు. 'మమ్మల్ని అక్కడి నుంచి తరిమికొట్టే ముందు మా నుంచి రూ 5,000, రెండు మొబైల్ ఫోన్లు, ఏటీఎం కార్డ్‌లు తీసుకున్నారు. సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లిన తర్వాత మేము మా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాం.. వారు మమ్మల్ని తిరునల్వేలి మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చేర్చారు' అని భయానక అనుభవాన్ని వివరించారు.

పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం

సుప్రీంకు కేరళ ప్రభుత్వం

తిరువనంతపురం: కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం, రాజ్‌భవన్ మధ్య ఘర్షణ కొనసాగుతోంది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు సైతం గవర్నరు వద్ద నిలిచిపోవడంతో కొంతకాలంగా ప్రభుత్వం తీవ్ర అసహనంతో ఉంది. చివరికి బిల్లుల వివాదంపై ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను సకాలంలో క్లియర్ చేసేలా గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను ఆదేశించాలని పిటిషన్‌లో కోరింది. మొత్తం ఎనిమిది బిల్లులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో మూడు బిల్లులు రెండేళ్లకు పైగా ఆయన డెస్క్‌లోనే ఉన్నాయి. మరో మూడు 12 నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. గవర్నర్‌ను ప్రభుత్వ అధ్వర్యంలోని యూనివర్సిటీ చాన్సలర్‌గా తొలగించడం పెండింగ్ బిల్లుల్లో ఒకటి. గవర్నర్ బిల్లులను పరిష్కరించకపోవడం ఏకపక్షం, చట్టవిరుద్ధం, రాజ్యాంగ బాధ్యతల ఉల్లంఘనతో సమానమని ప్రభుత్వం వాదించింది. గవర్నర్‌కు సమర్పించిన ప్రతి బిల్లును నిర్దిష్ట సమయంలో పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్య ప్రక్రియను పరిగణనలోకి తీసుకుని ప్రజల సంక్షేమం కోసం, ప్రజాప్రయోజనాల కోసం ఇతర చట్టాలను అనుసరించి రూపొందించిన బిల్లులు, ప్రజా సంక్షేమం కోసం రూపొందించిన బిల్లులను సకాలంలో పరిష్కరించేలా గవర్నర్‌ను ఆదేశించాలని పిటిషన్‌లో కోరింది. గవర్నర్ తన రాజ్యాంగ అధికారాలు, విధులు నిర్వర్తించడంలో విఫలమయ్యారని కేరళ ప్రభుత్వం పిటిషన్‌లో ఆరోపించింది. తమిళనాడులోనూ ఇదేవిధమైన వివాదం కొనసాగుతోంది. క్లియరెన్స్ కోసం తనకు పంపిన బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని స్టాలిన్ ప్రభుత్వం వాదిస్తోంది. గవర్నర్ రాజకీయ ప్రత్యర్థిలా వ్యవహరిస్తున్నారంటూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

మేము 65 సీట్లలో పోటీ చేస్తాం

ఇండియాకు 15 మాత్రమే: అఖిలేశ్

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని గద్దె దించడమే ప్రధాన లక్ష్యంగా జట్టుకట్టిన విపక్ష కూటమి (ఇండియా)లో ఐక్యత మేడిపండు సామెతను తలపిస్తోంది. భారతీయ జనతా పార్టీని ఓడించడమే కూటమిలోని అన్ని పార్టీల ఉమ్మడి లక్ష్యమైనప్పటికీ... సీట్ల సర్దుబాటు విషయంలో ఏ ఒక్కరూ రాజీపడే ప్రసక్తే లేదన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. తాజాగా కీలకమైన ఉత్తర ప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలకు గాను తమ పార్టీ 65 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తుందని, మిగతా 15 స్థానాలు కాంగ్రెస్, ప్రతిపక్ష ఇండియా కూటమి పక్షాలకు వదిలివేయనున్నట్లు అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) వర్గాలు వెల్లడించాయి. 65 స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులను దాదాపుగా ఖరారు చేసినట్లు ఆ పార్టీ చెబుతోంది. ఒకవేళ ఇండియా కూటమితో అవగాహన కుదరనట్లయితే బీజేపీతో ఒంటరిగా పోరాడటానికి పార్టీ సిద్ధంగా ఉందని కూడా ఎస్పీ వర్గాలు తెలిపాయి. పొత్తులు కుదిరితే అమేథీ, రాయ్‌బరేలీలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులను నిలబెట్టదు. ఓ పక్క మధ్యప్రదేశ్ అసెంబ్లీ సీట్ల పంపకాలపై కాంగ్రెస్ టెన్షన్‌లో ఉన్న క్రమంలో ఎస్పీ ఈ బాంబు పేల్చింది. రాష్ట్రంలోని 230 స్థానాల్లో తమ పార్టీ ఆరింటిలో పోటీ చేస్తుందని - కాంగ్రెస్‌తో చేసుకున్న ఒప్పందాన్ని విస్మరించారని గత నెలలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. 'నాకు తెలిస్తే, మేము కాంగ్రెస్‌తో మాట్లాడేవాళ్లం కాదు' అని ఆయన అన్నారు. అయితే గత సోమవారం అఖిలేశ్ యాదవ్ తాము ఇండియా కూటమిలో భాగమేనని చెప్పడం ద్వారా సీట్ల గొడవను తేలికబర్చారు. వెనుకబడిన తరగతులు, దళిత వర్గాలు, మైనారిటీల ఓటర్లను లక్ష్యంగా చేసుకునే తన ప్రణాళిక... బీజేపీని ఓడించడానికి కీలకమన్నారు. కాగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్న సంకల్పానికి 'ఇండియా' ఎంతవరకు కట్టుబడి ఉందనే ఊహాగానాలు ఇటీవలి వారాల్లో విస్తృతంగా వ్యాప్తి చెందాయి. సార్వత్రిక ఎన్నికలకు కూటమి ముందస్తు సన్నాహక పనిని కాంగ్రెస్ ఆలస్యం చేసిందని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఆరోపించిన తర్వాత ఇది మరింత ఊపందుకుంది. 'మేము వారి (కాంగ్రెస్)తో మాట్లాడుతున్నాము. ఇండియా కూటమిలో వారిని ముందుకు తీసుకువెళుతున్నాము. కానీ, ఆలస్యంగా... ఆ అంశంలో పెద్దగా పురోగతి లేదు. ఐదు అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ ఎక్కువ ఆసక్తి చూపుతోంది' అని ఆయన అన్నారు.

ఐబ్రోస్ చేయించుకున్నందుకు...

విడాకులిచ్చిన భర్త

కాన్పూర్: ఐబ్రోస్ చేయించుకున్నందుకు ఓ మహిళ విడాకులు తీసుకోవాల్సి వచ్చింది. ఐబ్రోస్ చేయించుకున్నందుకు భర్తకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వెంటనే భార్యకు విడాకులు ఇచ్చేశాడు. సౌదీ అరేబియా నుంచి వీడియో కాల్ చేసి 'ట్రిపుల్ తలాక్' చెప్పాడు. ఉత్తరప్రదేశ్‌లో వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు...ఐబ్రోస్ చేయించుకున్నానని తన భర్త మహ్మద్ సలీమ్ 'ట్రిపుల్ తలాక్' చెప్పాడని ఉత్తరప్రదేశ్‌లోని కన్పూర్‌కు చెందిన గుల్సబా ఆవేదన చెందింది. తన అభీష్టానికి విరుద్ధంగా ఐబ్రోస్ షేప్ చేయించుకోవడాన్ని కారణంగా పేర్కొన్నాడని తెలిపింది. అత్తంటివారు కట్నం కోసం వేధిస్తున్నారని, హింసను భరించలేకపోతున్నానని ఆమె ఆరోపించింది. ముస్లిం వివాహ చట్టం కింద భర్తపై కేసు పెట్టానని వెల్లడించింది. కాగా 2022 జనవరిలో గుల్సబాను మహ్మద్ సలీం పెళ్లి చేసుకున్నాడు.

ఉపాధి కోసం సలీం సౌదీఅరేబియా వెళ్లాడు. కుదిరినప్పుడల్లా భార్యతో వీడియో కాల్ మాట్లాడేవాడు. ఈ మధ్య వీడియో కాల్ మాట్లాడుతున్న సమయంలో భార్య ఐబ్రోస్ చేయించుకున్న విషయాన్ని అతడు గుర్తించాడు. దీనికోసం తన అనుమతి ఎందుకు తీసుకోలేదని తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. వెంటనే ట్రిపుల్ తలాక్ చెప్పేశాడు. కాగా భర్త మహ్మద్ సలీంపై భార్య గుల్సబా కేసు పెట్టింది. అత్తయ్య సహా అత్తంటివారిలో అనేకమందిపై ఫిర్యాదు చేసింది. కట్నం కోసం భార్య పట్ల క్రూరంగా ప్రవర్తించిన కారణంగా అతడిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

కేరళ పేలుళ్లపై వ్యాఖ్యలు...కేంద్రమంత్రిపై మరో కేసు

తిరువనంతపురం: కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై కేరళ పోలీసులు మరో కేసు నమోదు చేశారు. కేరళలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఇటీవల పేలుళ్లు సంభవించాయి. ఆ ఘటనకు సంబంధించి వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు పెంచేలా సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టులు పెట్టినందున పోలీసులు రెండో కేసు పెట్టారు. కేపీసీసీ డిజిటల్ మీడియా కన్వీనర్ పి.సారిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే కేసులో బీజేపీ జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోనీ పేరును చేర్చారు. కేరళలోని కలమస్సేరీలో ఆదివారం ఉదయం సంభవించిన పేలుళ్ల గురించి, మలప్పురం జిల్లాలో జరిగిన ఓ సమావేశం గురించి కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. దాంతో వివిధ వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టేలా ప్రకటనలు చేశారంటూ పోలీసులు ఆయనపై తొలికేసు నమోదు చేశారు. ఆ కేసు తాలుకా సెక్షన్లనే తాజాగా రెండో కేసుకూ వర్తింపజేశారు. ఈ కేసుల నమోదును బీజేపీ ఖండించింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుజ్జగింపు రాజకీయాలను వెలుగులోకి తెచ్చినందుకే పోలీసులు కేసు పెట్టారని కేంద్రమంత్రి రాజీవ్ ఆరోపించారు. కొచ్చి సమీపంలోని కలమస్సేరిలో 'జమ్రా అంతర్జాతీయ సమావేశ కేంద్రం'లోని ప్రార్థనా మందిరంలో ఆదివారం పేలుళ్లు సంభవించాయి. 12 ఏళ్ల బాలిక సహా ముగ్గురు మృతి చెందారు. కనీసం 50 మంది గాయాలపాలయ్యారు.

బనారస్ హిందూ వర్సిటీలో దుశ్శాసన పర్వం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో అకృత్యం చోటుచేసుకుంది. బైక్‌పై వచ్చిన ముగ్గురు మృగాళ్లు ఓ విద్యార్థిని దుస్తులు లాగి...లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఆ ఘటనను వీడియో తీశారని, బాధిత యువతి వసతి గృహానికి సమీపంలోనే ఈ దారుణం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. యూనివర్సిటీకి చెందిన విద్యార్థిని బుధవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లింది. వారిద్దరూ కర్మన్ బాబా ఆలయం వద్ద ఉండగా...ముగ్గురు దుండగులు బైక్‌పై వచ్చారు. స్నేహితుడిని బెదిరించి ఆమెను బలవంతంగా పక్కకు లాక్కెళ్లారు. ఆ తరువాత నిందితులు విద్యార్థిని దుస్తులు తొలగించి తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారు. 15 నిమిషాల తర్వాత బాధితురాలి ఫోన్ నంబర్ తీసుకొని విడిచిపెట్టారు. తనపై జరిగిన వేధింపుల పర్వంపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన వెలుగులోకి రావడంతో బనారస్ హిందూ విశ్వవిద్యాలయం విద్యార్థుల్లో ఆగ్రహం పెల్లుబికింది. వందల సంఖ్యలో గుమిగూడి వసతి గృహం వద్ద ఆందోళన చేపట్టారు. బయటి నుంచి వచ్చిన వ్యక్తులే ఈ దారుణానికి పాల్పడ్డారని ఆరోపించారు. క్యాంపస్‌లోకి బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు.

చట్టవిరుద్ధం...రాజకీయ ప్రేరేపితం

- సమన్లపై కేజ్రీవాల్...
- ఈడీ విచారణకు దూరం

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో తనకు జారీ చేసిన సమన్లు వెనక్కి తీసుకోవాలని కోరుతూ దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం ఈడీకి లేఖ రాశారు. అవి పూర్తిగా రాజకీయ కక్షతో జారీ చేసినవని విమర్శించారు. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం ఈ రోజు (నవంబర్ 2) కేజ్రీవాల్ ఈడీ కార్యాలయంలో హాజరుకావాల్సి ఉంది. కేజ్రీవాల్‌కు సమన్లు జారీచేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈడీ కార్యాలయం సమీపంలో ఆప్ కార్యకర్తలు ఆందోళనకు దిగకుండా భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. తుగ్లక్ రోడ్డులోని ఈడీ కార్యాలయం వద్ద పోలీసు యంత్రాంగం బారికేడ్లు ఏర్పాటు చేసింది. భారీ సంఖ్యలో పోలీసులు, పారా మిలిటరీ బలగాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. డీడీయూ మార్గ్‌లోని బీజేపీ కార్యాలయానికి వెళ్లే మార్గంలో, ఐటీఓ ప్రాంతంలోని ఆప్ కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. దాంతో ఇండియా గేట్, వికాస్ మార్గ్, ఐటీఓ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కేజ్రీవాల్ రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించేందుకు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలియడంతో అక్కడ కూడా భద్రత పెంచారు. ఈడీ సమన్లపై తాజాగా కేజ్రీవాల్ స్పందిస్తూ 'ఆ సమన్లు చట్టవిరుద్ధమైనవి. రాజకీయ ప్రేరేపితమైనవి. బీజేపీ సూచన మేరకే వాటిని పంపారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి నన్ను దూరం చేసేందుకు సమన్లు జారీ చేశారు. తక్షణమే సమన్లు ఉపసంహరించుకోవాలి' అని డిమాండ్ చేశారు. మరోవైపు, ఈడీ ఎదుట హాజరుకాకూడదని నిర్ణయించుకున్న కేజ్రీవాల్...పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్‌మాన్‌తో కలిసి మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. దాంతో ఈడీ ఆయనకు కొత్త తేదీతో మరోసారి సమన్లు జారీ చేసే అవకాశం ఉంది.

కపిల్ సిబల్‌కు అస్వస్థత

విచారణ ఆపి సహాయమందించిన సీజేఐ చంద్రచూడ్



న్యూఢిల్లీ: సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ గురువారం అస్వస్థతకు గురయ్యారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ స్పందించి... విచారణను కొంతసేపు నిలిపివేశారు. కపిల్ సిబల్‌కు సహాయం అందించారు. ఎన్నికల బాండ్ల విషయంపై సుప్రీంకోర్టులో మూడో రోజైన గురువారం వాడివేడిగా విచారణ కొనసాగింది. కేంద్రం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు, పిటిషనర్ల తరుపున వాదిస్తున్న కపిల్ సిబల్ కనిపించలేదు. దీంతో సిబల్ న్యాయ బృందాన్ని ఆరా తీయగా ఆయన అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. వెంటనే సీజేఐ చంద్రచూడ్ ఏం జరిగిందని మెహతాను అడిగారు. విచారణకు సంబంధం లేని విషయమని ఆయన చెప్పారు. విచారణ పునఃప్రారంభం కాగా, కొంత సేపటి తర్వాత కపిల్ సిబల్ కోర్టు గదిలోకి వచ్చారు. అయితే ఆయన ఆరోగ్యం బాగోలేదన్న విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి దృష్టికి మెహతా తీసుకెళ్లారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణలో పాల్గొనేందుకు వీలుగా తన ఛాంబర్‌ను వినియోగించుకునేందుకు అనుమతించాలని కోర్టును కోరారు. అలాగే సిబల్‌కు టీ, స్నాక్స్ ఏర్పాటు చేస్తానని చెప్పారు.

ఏడు నెలల్లో 419 మరణశిక్షలు

ఇరాన్ తీరుపై ఐరాస ఆవేదన

జెనీవా: ఇరాన్‌లో మరణశిక్షల అమలుపై ఐక్యరాజ్య సమితి (ఐరాస) ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఏడాది ఏడునెలల్లో 419 మందికి మరణ దండన అమలు జరిగిందని తెలిపింది. గతేడాదితో పోల్చితే ఉరిశిక్షలు 30శాతం పెరిగాయని పేర్కొంది. నాలుగేళ్లుగా ఏటా అమలవుతున్న మరణశిక్షల్లో దాదాపు 25శాతం పెంపుదల నమోద వుతోంది. ఈ క్రమంలో ఇరాన్‌లో మానవహక్కుల పరిస్థితులకు సంబంధించిన నివేదికను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ జనరల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో 419 మందికి ఇరాన్ మరణశిక్ష విధిం చిందన్నారు. ఇందులో ఏడుగురు హిజాబ్ వ్యతిరేక ఆందోళనకారుల న్నారు. 239 మంది మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాల్లో నిందితులని చెప్పారు. హిజాబ్ వ్యతిరేక ఆందోళనలలో నమోదైన కేసుల విచారణల్లో పారదర్శకత, స్వతంత్ర దర్యాప్తు జరగలేదన్నారు. నిరసనల సమయంలో దాదాపు 20వేల మందిని నిర్బంధించినట్లు సమాచారం ఉందని, దేశ భద్రత నెపంతో మరణశిక్షలను ఇరాన్ సమర్థించుకోవడం శోచనీయమని గుటెర్రస్ అన్నారు.

ఇంధన ఆదాకు ప్రత్యేక ప్రణాళిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 2030 నాటికి 3.88 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన ఇంధన ఆదా లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తు న్నామని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ వెల్లడించారు. 2070 నాటికి దేశంలో నెట్ జీరో ఉద్గారాల సాధించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రణాళిక దోహదం చేస్తుందన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సహకారం తో ఏపీ స్టేట్‌ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఎస్ఈసీఎం) గురువారం విజయవాడలోని విద్యుత్ సౌధలో వర్క్ షాప్ నిర్వహించింది. పరిశ్రమలు, రవాణా, డిస్కమ్‌లు, మున్సిపల్, కాలుష్య నియంత్రణ, వ్యవసాయం, హౌసింగ్, ఫిషరీస్ సహా కీలక విభాగాలకు చెందిన వివిధ అధికారులు హాజరయ్యారు. విజయా నంద్ మాట్లాడుతూ 2030 నాటికి కర్బన ఉద్గారాల తీవ్రతను 45 శాతం తగ్గించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీని కోసం ఆంధ్రప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాలు ఇంధన పొదుపు లక్ష్యాలను గుర్తించేందుకు రాష్ట్ర ఇంధన సామర్థ్య కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని చెప్పారు. సీఐఐ నివేదిక ప్రకారం, సీప్ భారీ స్థాయిలో ఇంధన సామర్థ్య అవగాహన కల్పిం చడం, పరిశ్రమ, రవాణ, వ్యవసాయం ఫిషరీష్ బిల్డింగ్ విభాగాల్లోని ఇంధన సామర్థ్య రంగంలో దాదాపు రూ. 8వేల కోట్ల మార్కెట్ సామర్థ్యాన్ని సృష్టించేందుకు ప్రణాళిక అందించనుందని వివరిం చారు. రాష్ట్ర ఇంధన పొదుపు లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ ప్రణాళిక అమలు చేయడం ద్వారా 2031 నాటికి 12 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గింపునకు దోహదం చేస్తుందని అంచనా వేశామన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సీఎం వైఎస్ జగన్, విమల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఎస్ఈసీఎం సీఈఓ బీఏవీపీ కుమార్ రెడ్డి, ఏపీ ట్రాన్స్ కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ బీ మల్లా రెడ్డి, ఏపీసీపీ డీసీఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ జే పద్మ జనార్దన్ రెడ్డి, సీఐఐ ప్రతినిధి నిషా జయరామ్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

నాపై కక్షసాధింపు... ఏ తప్పు చేయలేదు

- ఎథిక్స్ కమిటీ ఎదుట మహువా వివరణ
- అనైతికంగా ప్రశ్నిస్తారా: టీఎంసీ ఎంపీ అసహనం, వాకౌట్

న్యూఢిల్లీ: 'ఇదంతా నాపై కక్షసాధింపు, నేను ఏ తప్పు చేయలేదు' అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా తెలిపారు. ముడుపులు అందుకొని పార్లమెంటులో ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మహువా గురువారం పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ ఎదుట హాజరయ్యారు. తాను నిర్దోషినని వివరణ ఇచ్చుకున్నారు. అయితే చెడిపోయిన వ్యక్తిగత బంధమే తనపై ఫిర్యాదుకు కారణమైందని ఆమె వెల్లడించారు. మహువా వాంగ్మూలాన్ని కమిటీ సేకరించింది. తన మీద కక్షసాధింపు కోసం న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్ ఇదంతా చేస్తున్నట్లు మహువా ఆరోపించారు. అనంత్‌తో మహువా గతంలో సహజీవనం చేశారని, కొద్ది కాలానికి విడిపోయారని, ఆపై పెంపుడు కుక్కతో పాటు కొన్ని విషయాల్లో వీరి మధ్య విభేదాలు ఏర్పడినట్లు మీడియా చెబుతోంది. అయితే ఎథిక్స్ కమిటీ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే క్రమంలో తనపై ఆరోపణలను మహువా తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ లాగిన్ ఐడీని వ్యాపారవేత్త హీరానందానికి ఇచ్చినట్లు అంగీకరించారు. అయితే ఆ ఐడీలను ప్రశ్నలను పోస్టు చేయడానికి మాత్రమే వాడతారని, వాటితో దేశ భద్రతకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉండబోదని మహువాకు ఎథిక్స్ కమిటీలోని విపక్ష నేతలు మద్దతిచ్చారు. అదే సమయంలో ఎథిక్స్ కమిటీ తీరును మహువా తీవ్రంగా ఖండించారు. ఇది ఎలాంటి మీటింగ్? ఇష్టమొచ్చినట్లు ప్రశ్నలు వేస్తున్నారు? నీచమైన ప్రశ్నలు అడిగారు? అవి నన్ను ఎంతగానో బాధించాయి' అని మహువా అసహనానికి లోనయ్యారు. కమిటీ తీరును నిరసిస్తూ వాకౌట్ చేశారు. ఆమె వెళ్లిపోయే సమయంలో నా కన్నీళ్లు మీకు కనిపిస్తున్నాయా అని భావోద్వేగంగా అంటున్న దృశ్యాలు బయటకొచ్చాయి. 'మహువాకు కమిటీ వ్యక్తిగత, అనైతిక ప్రశ్నలు వేసింది' అని విపక్ష ఎంపీ ఒకరు తెలిపారు. విచారణ క్రమంలో ఆ వివరాలన్నీ బయటకు వచ్చాయన్నారు. సమావేశాన్ని నిర్వహించిన తీరును ప్రశ్నించారు.

విచారణకు సహకరించలేదు: సోంకర్

విచారణకు మహువా సహకరించలేదని ఎథిక్స్ కమిటీ చైర్మన్ వినోద్ సోంకర్ అన్నారు. విపక్ష సభ్యులు కూడా ఆగ్రహం వ్యక్తంచేశారని, మరిన్ని ప్రశ్నలకు సమాధానం దాటవేసేందుకే మహువా వాకౌట్ చేశారని సోంకర్ అన్నారు.

వైసీపీ 'చేయూత' బూటకం

- పాడి పశువుల కొనుగోలులో రూ.2,887 కోట్ల కుంభకోణం
- విచారణ చేపట్టాలని జనసేన నేత నాదెండ్ల మనోహర్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పాడి పశువుల కొనుగోలు, పంపిణీ మాటున వైసీపీ ప్రభుత్వం దాదాపు రూ.2,887 కోట్ల భారీ కుంభ కోణానికి పాల్పడిందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సంచలన ఆరోపణలు చేశారు. లక్షల కొద్దీ పాడి పశు వులు కొనుగోలు చేశామని శాసన సభలో ప్రభుత్వం చెప్పిన అధికారిక లెక్కలకు, క్షేత్ర స్థాయిలో అధికారులు చేసిన పరిశీలనలో తేలిన లెక్కలకు అసలు పొంతనే లేదన్నారు. అధికారుల పరిశీలనలో ఉన్నవి కేవలం 8 వేలు మాత్రమే అని తెలిపారు. వైఎస్సార్ చేయూత పథకం కింద పశువుల కొనుగోలులో జరిగిన ఈ కుంభకోణం విలువ బీహార్ దాణా కుంభకోణం కంటే పెద్దదని స్పష్టం చేశారు. మినీ డెయిరీల పేరుతో అక్క చెల్లెమ్మలను వైసీపీ ప్రభుత్వం నిండా మోసం చేసిందని చెప్పారు. పశువుల కొనుగోలు కుంభకోణం మీద ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహిళా సాధి కారితపై శాసనసభలో సెప్టెంబర్ 25, 2023లో జరిగిన స్వల్పకాలిక చర్చలో భాగంగా మహిళ సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలం బన కోసం 2,08,790 పాడి పశువులను కొనుగోలు చేశామని చెప్పారు. విచిత్రంగా ఆ మరుసటి రోజే వ్యవసాయ శాఖపై జరుగుతున్న చర్చలో సంబంధిత మంత్రి పాల వెల్లువ పథకం కింద 3.94 లక్షల పాడి పశువులను కొనుగోలు చేశామని చెప్పారు. ఒక్క రోజులోనే 1,85,210 పాడి పశువులు ఎలా పెరిగాయో ముఖ్యమంత్రిగానీ, సంబంధిత మంత్రులుగానీ సమా ధానం చెప్పాలి. అయితే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసిన పశు సంవర్థక శాఖ, డెయిరీ విభాగాల అధికా రులకు వాస్తవంలో కనిపించినవి 8 వేల పశువులు మాత్రమే. ఒక గేదెను కొనుగోలు చేసి ఆ గేదెనే అనేక మంది కోసం కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపిం చారు. అసలు లక్షల్లో పాడి పశువులు కొనుగోలు చేసి పంపిణీ చేయడం కష్ట సాధ్యమైన ప్రక్రియ. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పశుక్రాంతి పథకం ద్వారా 50 వేల పాడి పశువులను కొనుగోలు చేయ డానికి బీహార్, గుజరాత్, హరియాణా వంటి రాష్ట్రాలు తిరిగినా సాధ్యపడలేదు. ఇప్పుడు 3.94 లక్షల పాడిపశు వులు కొనుగోలు చేసినట్లు చెబుతు న్నారు. వాస్తవంలో ఉన్నవి 8 వేల పాడి పశువులు మాత్రమే. లక్షల కొద్దీ కొన్నామని చెప్పి కోట్ల ప్రజాధనం దోచేశారు. ప్రభుత్వం తీసుకొచ్చింది పాలవెల్లువ పథకం కాదు పాపాల వెల్లువ పథకమని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు.

వైసీపీ ప్రభుత్వ అవినీతిపై సీబీఐ విచారణ

హైకోర్టులో రఘురామకృష్ణరాజు పిటిషన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ శాఖల్లో గత నాలుగున్నర సంవత్సరాల్లో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ అధికారపార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు రఘురామకృష్ణరాజు గురువారం హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పెద్దఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ప్రజాధనానికి నష్టం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టవిరుద్ధ నిర్ణయాలు తీసుకుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. శాఖల వారీగా జరిగిన అవినీతిని అంచనా వేస్తూ పిటిషన్‌లో వివరించారు. సంక్షేమ పథకాల పేరుతో అవినీతికి పాల్పడ్డారని, వీటన్నింటిపై సీబీఐతో విచారణ జరిపించాలని ఆయన కోర్టుకి విజ్ఞప్తి చేశారు.

జగన్... కరువు కనిపించదా: ధూళిపాళ్ల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని రైతుల సమస్యలు, కరువు దుస్థితి ముఖ్యమంత్రి జగన్‌కు కనిపించడం లేదా అని టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రశ్నించారు. కరువు మండలాలు ప్రకటిస్తూ ప్రభుత్వమిచ్చిన జీవో-4 వృధాగా మారిందన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ధూళిపాళ్ల మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ తీరును విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రాప్ వెదర్ వాచ్ గ్రూప్‌కు సంబంధించి ప్రతివారం రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం సమీక్షించాలన్నారు. సీఎంకు, మంత్రులకు అసలు ఆ మార్గదర్శకాలు ఏమిటో, కేంద్ర ప్రభుత్వ ఆలోచనలేమిటో తెలియబోవన్నారు. 20 రోజుల్లోనే మొక్కుబడిగా కరువు మండలాలు ప్రకటించి రైతాంగంపై, వ్యవసాయంపై బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శించుకుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. కరువు వల్ల తమ రాష్ట్రంలో రూ.30 వేలకోట్ల నష్టం వాటిల్లిందని కర్నాటక ప్రభుత్వం కేంద్రానికి నివేదికలిస్తే, ఏపీ ప్రభుత్వం ఇప్పటికీ రాష్ట్ర పరిస్థితులపై కేంద్రానికి ఎందుకు నివేదించలేదని ప్రశ్నించారు. ఈ సంవత్సరం రైతాంగం లక్షలాది ఎకరాల్లో పంటలు వేయకపోయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. రైతాంగం విషయంలో పాలకుల వైఖరి చాలా దారుణంగా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడి నేతృత్వంలో టీడీపీ రైతు విభాగం సమావేశమైందని, కరువు మండలాల్లో పర్యటించాలని నిర్ణయించిందన్నారు. రైతుల్ని కలిసి వారి కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా జనసేననూ కలుపుకుని ప్రత్యేక కార్యాచరణతో టీడీపీ ముందుకెళ్తుందన్నారు.

పురకాయస్థ, చక్రవర్తి కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: న్యూస్ క్లిక్ వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పురకాయస్థ, హెచ్ఆర్ శాఖాధిపతి అమిత్ చక్రవర్తి డిసెంబరు ఒకటో తేదీ వరకు జైల్లోనే ఉండనున్నారు. ఈ మేరకు జ్యుడిషియల్ కస్టడీని పొడిగిస్తూ దిల్లీ కోర్టు గురువారం ఆదేశాలిచ్చింది. చైనా నుంచి నిధులు సమకూర్చుకున్నట్లు ఆరోపణలు రాగా వీరిపై ఉపా చట్టం కింద కేసు నమోదైంది. అక్టోబరు 25న వీరిద్దరి కస్టడీ విచారణకు దిల్లీ పోలీసులకు కోర్టు అనుమతిచ్చింది. కస్టడీ గడువు ముగియడంతో పురకాయస్థ, చక్రవర్తిని కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును ప్రత్యేక న్యాయమూర్తి హర్‌దీప్ కౌర్ విచారించారు. కస్టడీని డిసెంబరు 1వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా పురకాయస్థ, చక్రవర్తి అక్టోబరు 3న అరెస్టైన విషయం తెలిసిందే.

హ్యాకింగ్ వివాదం...

యాపిల్‌కు కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ: విపక్ష ఎంపీల ఐఫోన్లకు హ్యాకింగ్ అలర్ట్ సందేశాలపై కేంద్ర ప్రభుత్వం చర్యలకు దిగింది. యాపిల్ సంస్థకు కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రాయోజిత వ్యక్తులు హ్యాకింగ్‌కు ప్రయత్నిస్తున్నట్లు ధ్రువీకరించేందుకు ఏమైనా ఆధారాలు ఉంటే సమర్పించాలని యాపిల్‌ను ఆదేశించింది. ఈ విషయాన్ని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ ధ్రువీకరించారు. మరోవైపు హ్యాకింగ్ ఆరోపణలపై భారత ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ.. కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్సెస్ టీమ్ ఆఫ్ ఇండియా విచారణ జరుపుతోంది. అంతకముందు విపక్ష ఎంపీల ఐఫోన్‌లకు అలర్ట్ మెసేజ్‌లు రావడంపై యాపిల్ స్పందించింది. నోటిఫికేషన్లను ప్రభుత్వ ప్రాయోజిత వ్యక్తులకు ఆపాదించలేమని పేర్కొంది. ఒక్కోసారి యాపిల్ ఫోన్లకు వచ్చే కొన్ని అలర్ట్ నోటిఫికేషన్లు నకిలీ హెచ్చరికలు అయి ఉండొచ్చని తెలిపింది. తమ యాపిల్ ఫోన్లను హ్యాక్ చేసేందుకు ప్రభుత్వ ప్రాయోజిత వ్యక్తుల ద్వారా ప్రయత్నం జరిగిందని ఇప్పటికే చాలామంది విపక్ష నేతలు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ మేరకు తమ ఐఫోన్లకు అలర్ట్ సందేశాలు వచ్చాయని వారు వెల్లడించారు. దీంతో ఈ ఘటన తీవ్ర దుమారం రేపింది. దీనిపై స్పందించిన కేంద్ర ఐటీ శాఖ.. హ్యాకింగ్ ప్రయత్నం జరిగినట్లు వెల్లువెత్తిన అనుమానాలపై 'సెర్ట్‌ఇన్' ద్వారా సమగ్ర సాంకేతిక విచారణ జరుపుతామని వెల్లడించింది.

లంకకు షాకిచ్చిన రోహిత్ సేన

- 302 పరుగుల తేడాతో రికార్డు విజయం
- 55 పరుగులకే కుప్పకూలిన శ్రీలంక
- ప్రపంచకప్‌లో సెమీస్ చేరిన తొలిజట్టు టీమిండియా

ముంబై: ఐసీసీ వన్డే క్రికెట్ ప్రపంచకప్‌లో టీమిండియా అధికారికంగా సెమీస్‌లో అడుగు పెట్టింది. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన టీమిండియా... 14 పాయింట్లతో సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. లీగ్ పోరులో భాగంగా గురువారం ఇక్కడి వాంఖడే స్టేడియంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. 358 పరుగుల ఛేదనలో శ్రీలంక... కనీసం పోటీకూడా ఇవ్వకుండా చేతులెత్తేసింది. భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక... 19.4 ఓవర్లలో 55 పరుగులకే ఆలౌట్ అయి 302 పరగుల తేడాతో ఓడిపోయింది. మహ్మద్ సిరాజ్, షమీ, బుమ్రాలు నిప్పులు చెరిగి లంకను కోలుకోనీయలేదు. లంక బ్యాటర్లలో ఏంజెలో మాథ్యూస్ (12), మహీశ్ తీక్షణ (12 నాటౌట్), కసున్ రజిత (14)లు మాత్రమే రెండంకెల స్కోరు చేయగా రజిత టాప్ స్కోరర్. ఆ జట్టులో ఏకంగా ఐదుగురు డకౌట్ కాగా ముగ్గురు సింగిల్ డిజిట్ స్కోరుకే ఔటయ్యారు.

నిప్పులు చెరిగిన భారత పేస్ త్రయం

బ్యాటింగ్‌కు స్వర్గధామమైన వాంఖడేలో భారత పేస్ త్రయం జస్ప్రిత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీల ధాటికి లంక విలవిల్లాడింది. స్కోరుబోర్డుపై పరుగులేమీ చేరకుండానే తొలి వికెట్ కోల్పోయిన లంక... ఆ తరు వాత కోలుకోలేదు. బుమ్రా ఇచ్చిన ఆరంభాన్ని సిరాజ్ కొనసాగించాడు. తొలి బంతికే బుమ్రా...నిశ్శంకను వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా... సిరాజ్ రెండో ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టి... ఆ తర్వాత ఓవర్లో మరో వికెట్ తీశాడు. రెండో ఓవర్లోనే తొలి బంతికి కరుణరత్నె... ఐదో బంతికి సమరవిక్రమ నిష్క్రమించారు. ఈ ముగ్గురూ సున్నాలు చుట్టారు. సిరాజ్ తన మరుసటి ఓవర్లో... కెప్టెన్ కుశాల్ మెండిస్ (1)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. 3.1 ఓవర్లో నాలుగో వికెట్ కోల్పోయిన లంక.. 9.2వ ఓవర్ వరకూ కాసేపు వికెట్ పడకుండా అడ్డుకోగలిగింది. 24 బంతులాడిన చరిత్ అసలంక ఒక్క పరుగే చేశాడు. ఏంజెలా మాథ్యూస్ .. 25 బంతులాడి 12 పరుగులు చేశాడు. లంక తరపున తొలి బౌండరీని సాధించాడు. ఐదు ఓవర్ల పాటు వికెట్ల పతనాన్ని అడ్డుకున్న మాథ్యూస్ - అసలంకల జోడీ ఐదో వికెట్‌కు 11 పరుగులు జోడించింది. ఈ జోడీని షమీ విడదీసి లంకను కోలుకోనీయకుండా చేశాడు. తాను వేసిన తొలి ఓవర్లోనే (10వ ఓవర్) లంకకు డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. వరుస బంతుల్లో అసలంక, హేమంతలను ఔట్ చేశాడు. 12వ ఓవర్లో షమీ.. చమీరను ఔట్ చేయగా.. 14వ ఓవర్లో మాథ్యూస్ కూడా నిష్క్రమించాడు. 14 ఓవర్లలో లంక స్కోరు.. 36-8 మాత్రమే. ఈ దశలో అసలు లంక 50 పరుగులైనా చేస్తుందా..? అన్న అనుమానం కలిగింది. కానీ చివరిలో తీక్షణ, రజితలు తొమ్మిదో వికెట్‌కు 20 పరుగులు జోడించడంతో ఆ జట్టు 50 పరుగులు చేయగలిగింది. భారత బౌలర్లలో షమీ మరో సారి ఐదు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టగా సిరాజ్ మూడు వికెట్లు తీశాడు. బుమ్రా, జడేజాలకు తలా ఓ వికెట్ దక్కింది.

రాణించిన గిల్, కోహ్లి, అయ్యర్

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా... నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (92 బంతుల్లో 92, 11 ఫోర్లు, 2 సిక్సర్లు), విరాట్ కోహ్లి (94 బంతుల్లో 88, 11 ఫోర్లు) శతకాలు మిస్ చేసుకోగా శ్రేయస్ అయ్యర్ (56 బంతుల్లో 82, 3 ఫోర్లు, 6 సిక్సర్లు) ఆఖర్లో మెరుపులు మెరిపించి భారత్ భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. లంక బౌలర్లలో దిల్షాన్ మధుశంక.. ఐదు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత్‌కు తొలి ఓవర్‌లోనే షాక్ తాకింది. మొదటి బంతి బౌండరీ బాదిన రోహిత్ శర్మ... మధుశంక వేసిన రెండో బంతికి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. వన్ డౌన్‌లో వచ్చిన విరాట్ కోహ్లితో పాటు గిల్ భారత స్కోరుబోర్డును నడిపించారు. ఈ ఇద్దరూ.. క్రీజులో కుదురుకున్నాక ధాటిగా ఆడారు. రెండో వికెట్‌కు 189 పరుగులు జోడించారు. అయితే సెంచరీలకు చేరువవుతున్న క్రమంలో మధుశంక భారత్‌కు డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. 30వ ఓవర్లో గిల్‌ను ఔట్ చేసిన మధుశంక.. అతడే వేసిన మరుసటి ఓవర్లో కోహ్లిని కూడా పెవిలియన్‌కు పంపాడు. కోహ్లి-గిల్‌లు నిష్క్రమించాక క్రీజులోకి వచ్చిన కేఎల్ రాహుల్ (19 బంతుల్లో 21, 2 ఫోర్లు)- శ్రేయాస్ అయ్యర్‌లు నాలుగో వికెట్‌కు 60 పరుగులు జోడించారు. ఉన్నంతసేపూ ఆత్మవిశ్వాసంతో ఆడిన రాహుల్.. చమీర వేసిన 40వ ఓవర్లో హేమంతకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. సూర్యకుమార్ యాదవ్ (12) మాత్రం తేలిపోయాడు. ఈ మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ బ్యాట్ ఝుళిపించాడు. కసున్ రజిత వేసిన 36వ ఓవర్లో భారీ సిక్సర్ బాదిన అయ్యర్... తీక్షణ వేసిన 41వ ఓవర్లో లాంగాఫ్ మీదుగా అద్భుతమైన సిక్స్ కొట్టాడు. 36 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన అయ్యర్.. ఆ తర్వాత ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు.

ఉద్యోగార్థులకు ప్రభుత్వం తీపికబురు

ఎంపీ విజయసాయి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగార్థులకు జగన్ ప్రభుత్వం తీపికబురు అందించిందని, ఈ నెలలో వరుసగా 23 నోటిఫికేషన్ల విడుదలకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తోందని రాజ్యసభ సభ్యులు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి చెప్పారు. సోషల్ మీడియా వేదికగా గురువారం రాష్ట్రంలో అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలను వెల్లడించారు. నోటిఫికేషన్‌లో భాగంగా 100 గ్రూప్-1 పోస్టులు, 900 గ్రూప్-2 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వందల సంఖ్యలో డిగ్రీ లెక్చరర్ల పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఏటా కోటి ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తోందని, సుస్థిర సాగు, ఆహార భద్రత లక్ష్యంగా అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని తెలిపారు. సాగునీరు అందించడంలో జగన్ ప్రభుత్వం నవ చరిత్ర లిఖించిందన్నారు. వైఎస్ఆర్ అవార్డు గ్రహీతలకు విజయసాయిరెడ్డి అభినందనలు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.